ఉలిక్కిపడిన నగరం

కలకలం రేపిన తహసీల్దార్ హత్యోదంతం



హత్యకు గురైన తహసీల్దార్ సనపల రమణయ్య

విశాఖపట్నం/కొమ్మాది/ఆరిలోవ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కలకలం రేపిన తహసీల్దార్ సనపల రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. ఇందుకు సంబంధించి రకరకాల ప్రచారం జరుగుతోంది. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని భూమికి సంబంధించిన కన్వేయన్స్ డీడ్ జారీ అంశమే హత్యకు కారణమని స్పష్టంగా చెప్పారు. రూరల్ తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని కొంత భూమిలో రియల్టర్ ఒకరు భవన నిర్మాణాలు చేశారని, వాటిని విక్రయించాలంటే కన్వేయన్స్ డీడ్ తప్పనిసరి కావడంతో తహసీల్దార్‌పై గత కొద్దిరోజులుగా ఒత్తిడి తెస్తున్నారన్నారు. రియల్టర్ అప్పటికే రూ.5-6 కోట్లు అప్పుల్లో ఉండడం, భవనం కూడా బ్యాంకుకు మార్టిగేజ్ చేసి ఉండడంతో తహసీల్దార్ చుట్టూ తిరుగుతున్నాడని, ఈ క్రమంలోనే హత్యకు పాల్పడి ఉంటాడని సీపీ వెల్లడించారు.

- కారణాలపై రకరకాల ప్రచారం
- నగరంలోని భూమికి కన్వేయన్స్ డీడ్ జారీ వ్యవహారమే కారణమని సీపీ వెల్లడి
- విజయనగరం జిల్లాలోని భూ వివాదం కారణమంటున్న రమణయ్య సోదరుడు
- తెరపైకి ప్రసాద్ అనే వ్యక్తి పేరు

అయితే రమణయ్యకు వరుసకు సోదరుడిగా చెబుతున్న రాజేంద్ర అనే వ్యక్తి మీడియాతో మాట్లాడుతూ తమకు విజయనగరం జిల్లా చీపురుపల్లి సమీపంలోని బొండపల్లి వద్ద మూడు ఎకరాల భూమి ఉందని, దానికి ఆనుకునే మధురవాడ ప్రాంతానికి చెందిన గంగారాం ప్రసాద్‌కు నాలుగు ఎకరాలు భూమి ఉందని చెబుతున్నారు. తాము వేరొకరికి రూ.1.8 కోట్లు బాకీ ఉండగా, వారి తరఫున ప్రసాద్ వకల్తా పుచ్చుకుని ఎంవీపీ కాలనీలో తాను ఉంటున్న ఫ్లాట్‌ను

... మిగతా 6వ పేజీలో



విచార వదనంలో కుమారుడు కృష్ణ రంగతో ఎమ్మార్వో సతీమణి అనూష

హత్యలకు దారితీస్తున్న భూవివాదాలు

- రాజకీయ అండతో రియల్టర్లు, రౌడీ మూకలు బరితెగింపు
- పథకం ప్రకారం తహసీల్దార్ హత్య



అపార్టుమెంటు సెల్లార్‌లో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నిందితుడు (మాస్క్ ధరించిన వ్యక్తి)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో భూ వివాదాలు హత్యలకు దారితీస్తున్నాయి. మొన్నటికి మొన్న రౌడీ మూక... ఎంపీ కుటుంబాన్నే కిడ్నాప్ చేసి 48 గంటలు చిత్రహింసలు పెట్టింది. అధికార పార్టీ ఎంపీని ఇబ్బందిపెట్టినా ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవడంతో రియల్టర్లకు, రౌడీలకు భయం లేకుండా పోయింది. ఆక్రమించిన దాంట్లో అధికార పార్టీ నేతలకు వాటా ఇస్తే తప్పించుకోవచ్చుననే విషయం అర్థమైంది. అందుకే బరి తెగిస్తున్నారు. భూముల విషయంలో సహకరించలేదనే కోపంతో తహసీల్దార్ సనపల రమణయ్యను ఇంటికి వెళ్లి మరీ చంపారు.

పథకం ప్రకారం సెల్లార్‌కు రప్పించారా?

ఇదిలావుండగా తహసీల్దార్ రమణయ్యపై నిందితుడు దాడి చేయడానికి ముందు మరో ఇద్దరు వ్యక్తులు ఆయన్ను కలిసి మాట్లాడి వెళ్లారు. ఇదంతా రాత్రి పది గంటల సమయంలో జరిగింది. బొండపల్లి నుంచి శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చిన రమణయ్యకు తొమ్మిది గంటల సమయంలో ఫోన్ వచ్చింది. పంతులు అనే వ్యక్తిని కలవడానికి రమణయ్య సెల్లార్‌లోకి వచ్చారు. ఇద్దరు వ్యక్తులు పంచెలు కట్టుకొని రాగా వారితో మాట్లాడి పంపించేశారు. వారు గేటు దాటుతుండగా మరో వ్యక్తి (నిందితుడు) లోపలకు వచ్చాడు. తన కోసమే వచ్చినట్టుగా గుర్తించి రమణయ్య ముందు కాసింత దూరంగా నిల్చొని మాట్లాడారు. ఆ తరువాత ఆ నిందితుడు ముందుకువచ్చి రాడ్‌తో కొట్టి తాపీగా వెళ్లిపోయాడు. ఇక్కడ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే..దాడి చేసిన

... మిగతా 6వ పేజీలో

పోలీసుల కళ్లుగప్పి బెంగళూరుకు నిందితుడు

- ఉదయమే విమానంలో చెన్నై వెళ్లినట్టు భావించిన పోలీసులు
- అక్కడకు బృందం
- తీరా చూస్తే సాయంత్రం 4.30 గంటలకు చెన్నై విమానంలో బెంగళూరుకు...
- నాలుగు సిమ్‌లు మార్చి మార్చి వాడుతున్నట్టు గుర్తింపు
- ఒకసారి భార్య నుంచి కాల్...



హత్యాస్థలిని పరిశీలిస్తున్న సీపీ రవిశంకర్ అయ్యనార్



రమణపై దాడి చేసిన వ్యక్తి

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

తహసీల్దార్ రమణయ్య హత్య కేసులో నిందితుడు...పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే నగరం విడిచి పరారు కాగలిగాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిందితుడు తొలుత అనకాపల్లి వైపు వెళ్లి ఒకచోట తలదాచుకున్నట్టు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి శనివారం ఉదయాన్నే ఎయిర్‌పోర్టుకు చేరుకుని చెన్నై వెళ్లిపోయినట్టు భావించిన పోలీసులు అక్కడకు ప్రత్యేక బృందాన్ని పంపించారు. ఈ క్రమంలో మధ్యాహ్నం రెండు గంటలకు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసిన సీపీ రవిశంకర్ అయ్యన్నార్ కూడా నిందితుడు ఎవరనే దానితోపాటు అతనికి సంబంధించిన పూర్తివివరాలు, ఎక్కడికి వెళ్లిపోయాడు, ఎక్కడి నుంచి టికెట్లు బుక్ చేసుకున్నాడనే వివరాలు సంపాదించామని ప్రకటించారు. త్వరలో అతడిని అదుపులోకి తీసుకుంటామని ధీమా వ్యక్తంచేశారు. అయితే నిందితుడు శనివారం సాయంత్రం వరకూ నగరంలోనే ఉన్నాడని, 4.30 గంటలకు బెంగళూరు మీదుగా చెన్నై వెళ్లే విమానం ఎక్కినట్టు తెలియడంతో పోలీసులు కంగుతిన్నారు. నిందితుడు బెంగళూరులో విమానం దిగిపోయాడు. చెన్నై వెళ్లలేదు. అయితే నిందితుడు బెంగళూరులో ఉండిపోయిన విషయం తెలియని పోలీస్ అధికారులు అప్పటికే చెన్నై వెళ్లిన బృందాన్ని అక్కడి ఎయిర్‌పోర్టుకు పంపించి విశాఖ నుంచి వచ్చిన విమానంలో నిందితుడి కోసం వెతికించారు. నిందితుడు కనిపించకపోవడంతో అతని సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ పరిశీలించగా బెంగళూరులోనే ఉండిపోయినట్టు తేలింది. నిందితుడు అప్పటికే నాలుగు సిమ్ కార్డులు మార్చి మార్చి వాడుతున్నట్టు, అతని భార్య కూడా శనివారం ఒకసారి ఫోన్ చేసి మాట్లాడినట్టు కాల్‌డేటాలో పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ఏదిఏమైనా పోలీసులు నిందితుడి ఆచూకీని పక్కాగా కనిపెట్టగలిగి ఉంటే నగరంలోనే అతడిని అరెస్టు చేసి ఉండగలిగేవారు. కానీ సరిగా అంచనా వేయలేకపోయారు. నిందితుడు ఉదయాన్నే నగరం విడిచి విమానంలో వేరే రాష్ట్రం వెళ్లిపోయినట్టు భావించారు. దీనివల్ల నిందితుడు నగరంలో జరుగుతున్న తతంగాన్ని మీడియాలో చూసి...సాయంత్రం బెంగళూరు వెళ్లాడు. నిందితుడు ఎవరనేది తెలిసినందున శనివారం ఉదయం నుంచి సరిహద్దుల్లో వాహనాల తనిఖీలు చేయడం, ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, బస్‌కాంప్లెక్స్‌లో నిఘా పెట్టినట్టయితే తప్పించుకునేందుకు అవకాశం ఉండేది కాదని కొంతమంది పోలీసులే అభిప్రాయపడుతున్నారు.

ఆరు గంటల్లో గుర్తిస్తే ఎందుకు పట్టుకోలేదు?

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ రమణయ్యను చంపిన వ్యక్తి వివరాలన్నీ ఆరు గంటల వ్యవధిలోనే సేకరించామని పోలీసులు అధికారులు శనివారం మధ్యాహ్నం వెల్లడించారు. ఘటన రాత్రి 10 గంటలకు జరగ్గా 11.30 గంటలకు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అక్కడి

... మిగతా 6వ పేజీలో

ఉద్యోగుల్లో ఆందోళన

- జిల్లా అధికారులకు రాత్రే అందిన సమాచారం
- మార్చురీ వద్దకు కలెక్టర్, ఇతర అధికారులు
- పెద్దఎత్తున చేరుకున్న రెవెన్యూ ఉద్యోగులు
- మిన్నంటిన కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు
- కలెక్టరేట్‌లో రెవెన్యూ సంఘం ఆధ్వర్యంలో నిరసన
- రక్షణ కల్పించాలంటూ జేసీ, సీపీకి వినతిపత్రాలు



రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తున్న ఉద్యోగులు


విశాఖపట్నం/మహారాణిపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):

జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. తహసీల్దారు సనపల రమణయ్య హత్య ఉద్యోగుల్లో అలజడి రేపింది. మండల ఎగ్జిక్యూటివ్ హోదా ఉన్న తహసీల్దారుపైనే విచక్షణా రహితంగా జరిగిన దాడిని అధికారులు జీర్ణించుకోలేకపోతున్నారు. విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ మల్లికార్జున అధికారులను అలర్ట్ చేశారు.

విశాఖ రూరల్ తహసీల్దారుగా సుమారు ఏడాది కాలంగా పనిచేస్తున్న సనపల రమణయ్యను ఎన్నికల ప్రక్రియలో భాగంగా రెండు రోజుల కిందటే విజయనగరం జిల్లాకు బదిలీ చేశారు. ఆయన శుక్రవారమే బొండపల్లి తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించారు. అదేరోజు

... మిగతా 6వ పేజీలో

చంద్రబాబు రాక రేపు



విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి)

'రా...కదలిరా' పేరుతో ఈనెల ఐదో తేదీన అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం గొందుపాలెంలో నిర్వహించనున్న బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆయన సోమవారం ఉదయం 10 గంటలకు ఉండవల్లిలో తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.20 గంటలకు గొందుపాలెం చేరుకుంటారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు సభలో పాల్గొంటారు. సభ ముగిసిన తరువాత తిరిగి 1.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా చింతలపూడి మండలంలో నిర్వహించనున్న సభలో పాల్గొనేందుకు వెళతారు.

చెలరేగిన బుమ్రా

తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 253 ఆలౌట్

బుమ్రాకు 6 వికెట్లు, కుల్దీప్ యాదవ్‌కు 3

భారత్‌కు 143 పరుగుల ఆధిక్యం

- అంతకుముందు డబుల్ సెంచరీ చేసిన జైస్వాల్
- కేరింతలతో భారత్ ఆటగాళ్లను ఉత్సాహపరిచిన ప్రేక్షకులు



జస్ప్రీత్ బుమ్రా 6 వికెట్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్), ఫిబ్రవరి 3:

ఇంగ్లండ్‌తో స్థానిక పీఎం పాలెం స్టేడియంలో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో భారత్ పట్టు బిగిస్తోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 171 పరుగులు ఆధిక్యంతో ఉంది. తొలిరోజు 176 పరుగులతో అజేయంగా ఉన్న భారత్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ రెండో రోజు శనివారం డబుల్ సెంచరీ పూర్తి చేయడంతో స్టేడియం అభిమానుల కరతాళ ధ్వనులతో హోరెత్తింది.

మ్యాచ్‌లో శుక్రవారం తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్లు కోల్పోయి 336 పరుగులు చేసిన భారత్ జట్టు...రెండో రోజు ఇన్నింగ్స్ ప్రారంభించిన కొద్దిసేపటికే అశ్విన్ (20) వికెట్‌ను కోల్పోయింది. ఇక 179 పరుగుల వ్యక్తిగత స్కోరుతో బ్యాటింగ్ కొనసాగించిన యశస్వి...ఇన్నింగ్స్ 101.2 ఓవర్‌లో బషీర్ వేసిన బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా సిక్సర్ బాదాడు. ఆ తర్వాత బంతిని స్క్వేర్ లెగ్ మీదుగా బౌండరీకి తరలించి డబుల్ సెంచరీ పూర్తిచేశాడు. తొలి డబుల్ సెంచరీ చేసిన జైస్వాల్ ముందుగా స్టాండ్స్‌లోని ప్రేక్షకులకు అభివాదం చేసి...తర్వాత భారత్ శిబిరం వైపు తిరిగి ఆనందాన్ని వ్యక్తం చేశాడు. 277 బంతుల్లో 18 బౌండరీలు, ఏడు సిక్సర్లతో డబుల్ సెంచరీ పూర్తిచేసిన యశస్వి (209) మరో తొమ్మిది పరుగులు జోడించిన అనంతరం అండర్సన్ బౌలింగ్‌లో షాట్‌కు యత్నించి డీప్ కవర్‌లో స్టోవ్ క్యాచ్ పట్టడంతో ఎనిమిదో వికెట్‌గా పెవిలియన్‌కు చేరాడు. చివరి రెండు వికెట్లు వెంటవెంటనే పడిపోవడంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 396 పరుగుల వద్ద ముగిసింది.

నిప్పులు చెరిగిన బుమ్రా...

లంచ్ సమయానికి ముందు ఇంగ్లండ్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఓపెనర్ బెన్ డకెట్ (21) నిలదొక్కుకుంటున్న సమయంలో కులదీప్ యాదవ్ అద్భుతమైన బంతితో అవుట్ చేశాడు. అర్ధ సెంచరీతో ఊపు మీద కనిపించిన మరో ఓపెనర్ జాక్ క్రాలే (76)ను అక్షర పటేల్ పెవిలియన్‌కు పంపడంతో ప్రేక్షకులలో ఉత్సాహం వచ్చింది. 24వ ఓవర్‌లో బౌలింగ్‌కు వచ్చిన జస్ప్రీత్ బుమ్రా మ్యాచ్ స్వరూపాన్ని మార్చేశాడు. తన రెండో ఓవర్‌లో రూట్ (5)ను అవుట్ చేసిన బుమ్రా...తర్వాత


... మిగతా 6వ పేజీలో



యశస్వి జైస్వాల్ 209 (290)



'ఐఎన్ఎస్ సంధాయక్' జాతికి అంకితం



సర్వే నౌక 'ఐఎన్ఎస్ సంధాయక్'ను శనివారం విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డులో రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకు నౌకాదళ అధికారులు జ్ఞాపిక అందజేశారు. - వివరాలు మెయిన్ 3లో

సమన్వయకర్తే అభ్యర్థి అవుతారన్న గ్యారంటీ లేదు

- గతంలో బీఫామ్ ఇచ్చిన తరువాత కూడా మార్చిన సందర్భాలు ఉన్నాయి
- గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి వ్యాఖ్యలు



మాట్లాడుతున్న తిప్పల నాగిరెడ్డి

గాజువాక, ఫిబ్రవరి 3: నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించినంత మాత్రాన...అతనే అభ్యర్థి అవుతాడన్నది ఎక్కడా లేదని, గతంలో బీఫామ్ ఇచ్చిన తరువాత కూడా క్యాండెట్లను మార్చిన సందర్భాలు ఉన్నాయని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఆయన శనివారం గాజువాక టీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో తన అనుచరులతో సమావేశమయ్యారు. శుక్రవారం 'ఆసరా' సమావేశంలో గాజువాక నియోజకవర్గ అభ్యర్థి ఉరుకూటి రామచంద్రరావేనని ఉత్తరాంధ్ర జిల్లాల వైసీపీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ప్రకటించడం

... మిగతా 6వ పేజీలో

'దళారులకు కూరగాయలు విక్రయించొద్దు'



గుర్తింపు కార్డులందజేస్తున్న ఏడీ యాసిన్

కంచరపాలెం, ఫిబ్రవరి 3 : రైతు బజారులో కూరగాయలను దళారులకు విక్రయించరాదని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ యాసిన్ అన్నారు. శనివారం స్థానిక రైతుబజారును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఎస్టేట్ అధికారి, సీహెచ్.కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'పశ్చిమం' నుంచి పోటీకి 'పాశర్ల' దరఖాస్తు

మహారాణిపేట: పశ్చిమ నియోజకవర్గనుంచి టీడీపీ తరపున పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నట్టు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఈమేరకు దరఖాస్తు అందించి, తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఆయన కోరారు.

తహసీల్దార్ హత్య దారుణం

- ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి
- నగరంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో ప్రశాంతమైన విశాఖ నగరంలో హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలువిపరీతంగా పెరిగిపోతున్నాయని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాయితీ అమలు చేస్తున్నారన్నారు. ఎవరైనా ఏదైనా అంశాన్ని వ్యతిరేకిస్తే చంపేస్తున్నారని ఆరోపించారు. విశాఖలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ఓ మండల మెజిస్ట్రేట్ఇంటికి వెళ్లి ఆయనను చంపేయడం దారుణమన్నారు. తహసీల్దార్‌ను హత్య చేసిన వ్యక్తిని వైసీపీకి చెందిన వ్యక్తిగా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ఈ హత్యతో విశాఖ ప్రజలు వణికిపోతున్నార న్నారు. వైసీపీ నాయకులు అధికారులతో తప్పులు చేయి స్తున్నారని, వాటి పర్యావసనమే తహసీల్దార్ హత్య అని విమర్శించారు. అవినీతిని ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ ఉదంతంతో వైసీపీ నేతలు, సీఎం జగన్ మోహనరెడ్డి సిగ్గు పడాలన్నారు. ఇకనైనా, తహసీల్దార్‌ను హత్య చేసిన నింది తులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఇన్ చార్జిలు కోరాడ రాజబాబు, గండిబాబ్జీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్,టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, పాశర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా, సమావేశంలో ఇన్‌చార్జిలు గండి బాబ్జీ, రాజబాబు

16న సమ్మె విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 3 : దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహిస్తున్న పారిశ్రామిక సమ్మెలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని యూనియన్‌ప్రధాన కార్యదర్శి సాగర్ కోరారు. శనివారం బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. బీఎస్ఎన్ఎల్‌కు కాకుండా 5జీలను ప్రైవేట్ కంపెనీలను రియలన్స్‌కు కేటాయించడం దుర్మార్గమన్నారు. బీఎస్ఎన్ఎల్ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం ఒక్క బీఎస్ఎన్ఎల్‌నే కాకుండా దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెబుతోందన్నారు.సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరాజు , అష్రఫ్, రామాంజనేయులు, ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు కృషి



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార, ఫిబ్రవరి 3: జాతీయ భావాలను కాపాడడంతోపాటు విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు అన్నారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మునిసిపల్ హై స్కూల్‌లో సంఘం ఆవిర్భావ దినోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనే భావనతో 1982 ఫిబ్రవరి 2న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించినట్టు సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రినాధమూర్తి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరామప్రసాద్, జిల్లా మహిళా కార్యదర్శి రామలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లతో సమావేశం

సీతమ్మధార, ఫిబ్రవరి 3: గ్రేటర్ 24వ వార్డులో కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ ఏజెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర నెడ్ క్యాప్ ఛైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా పండగ కానుకగా నూతన దుస్తులు పంపిణీ చేశారు.

జగన్ పాలనను అంతమొందించాలి

- మహిళా సదస్సులో జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్



మాట్లాడుతున్న ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 3:మహిళలు రాజకీయ చైతన్యంతో జగన్ దుర్మార్గ పాలనను అంతమొందించాలని ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ పిలుపునిచ్చారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా 43వ వార్డు మహిళా అధ్యక్షురాలు గారపాటి లక్ష్మి అధ్యక్షతన శనివారం సాయంత్రం చెక్కుడురాయి బిల్డింగ్ ప్రాంతంలో మహిళా సదస్సు జరిగింది. ఈ మేరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు ఆకర్షితులై పలువురు మహిళలు ఆపార్టీ చేరారు. పసుపులేటి ఉషాకిరణ్ మహిళలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 42వ వార్డు అధ్యక్షురాలు ముమ్మిన నాగమణి, 54వ వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్, 44వ వార్డు అధ్యక్షురాలు హేమ కల్యాణి, ఉండమట్ల వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే పార్టీకే మద్దతు

- మక్కా మసీద్ అధ్యక్షుడు షేక్ మున్నీర్



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 3: విశాఖలో ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన పార్టీకే తమ మద్దతు ఉం టుందని మక్కా మసీద్ అధ్యక్షుడు షేక్ మున్నీర్ కోరారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగరానికి చెందిన పది మసీదులకు చెందిన ముస్లిం వర్గానికి చెందిన నేతలు పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయన్నారు. 1994లో ఎస్ఏ రెహమాన్‌ను గెలిపించామన్నారు. విశాఖలో 1972లోనూ ముస్లిం నేత గెలిచినట్టు గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా జనాభాలో రెండోస్థానంలో ఉన్నా తమకు చట్ట సభల్లో తగిన ప్రాతినిధ్యంలేదని విచారం వ్యక్తంచేశారు. ముస్లిం నేత బాబు మాట్లాడుతూ దక్షిణ , ఉత్తరనియోజకవర్గాల్లో ముస్లిం నేతలకు టికెట్లు ఇవ్వాలని కోరారు. నాయకులు సనావుల్లా, జమీల్ అహ్మద్, అబ్దుల్ రహీమ్, అబ్దుల్ అజీజ్, అహ్మద్‌తుల్లా, రవూఫ్ పాల్గొన్నారు.

ఉచితంగా గర్భాశయ కేన్సర్ నిరోధక వ్యాక్సిన్లు

మహారాణిపేట, ఫిబ్రవరి 3: మహిళలకు గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నట్టు చైతన్యస్రవంతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షు రాలు షరీనా రహమాన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా శనివారం కేజీహెచ్‌లో చైతన్యస్రవంతి స్వచ్ఛంద సంస్థ, కేజీహెచ్ రేడియాలజీ, క్యాన్సర్ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శనివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 9 నుంచి 14 ఏళ్ల ఆడ పిల్లలకు ఉచితంగా రెండుసార్లు వ్యాక్సిన్లు వేస్తామన్నారు. వివాహం అయిన వారికి మూడుసార్లు అందిస్తామన్నారు. వైద్య పరీక్షల ద్వారా క్యాన్సర్ తొలిదశలో గుర్తించి తగిన చికిత్స అందజేసే వీలుంటుందని వైద్యులు సూచించారు. ఈ కార్యక్ర మంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి తెలిపారు. ముఖ్య అతిథిగా డా.రాకేష్‌రెడ్డి బోయ మహిళల్లో ప్రధానంగా వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ తదితర లక్షణాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వై.లక్ష్మి, ఎ.జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి వరలక్ష్మి, అధ్యాపకులు డి.లక్ష్మన్నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ధర్నా

సిరిపురం, ఫిబ్రవరి 3 : విశాఖ రైల్వే జోన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ నిర్ల క్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వనీ వైష్ణవ్ పార్లమెంట్‌లో రైల్వే జోన్ జాప్యానికి ఏపీ ప్రభుత్వం భూమి కేటాయించకపోవడమే కారణమని స్పష్టం చేశారన్నారు. కానీ జిల్లా కలెక్టర్ మాత్రం తాము భూమి కేటాయించినా రైల్వే అధికారులు తీసుకోలేదనడం అవాస్తవమని చెప్పారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సూచన మేరకు శాంతియుతంగా ధర్నా చేస్తున్న కార్యకర్తలను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుహాసినీ ఆనంద్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు దిలీప్‌నాయుడు, పోలిమేర శ్రీను, నాగరాజు, రామమోహన్, దామోదర్ యాదవ్ పాల్గొన్నారు.

గంజాయి సీజ్...నలుగురి అరెస్టు

సీతంపేట, ఫిబ్రవరి 3: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ అక్రమ రవాణాపై ముందుగా సమాచారమందడంతో దాడి చేశారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగకు చెందిన చాపల దుర్గారావు, డీశెట్టి భానోజీ, ఇనుపకుర్తి నరేంద్ర, ఎం. శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీసు స్టేషన్‌కి అప్పగించారు. సీఐ ఎస్.రమేశ్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు



సోదరితో అస్సాంనకు చెందిన నానాబస

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 3 : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న అస్సాంకుచెందిన నానాబస(19)ని కుటుంబ సభ్యులకు శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించినట్టు గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు అస్సాంలోని కొర్బి అంగ్లాంగ్ జిల్లా నైలలాంగ్ డిలాంగి గ్రామానికి చెందిన నానాబస మతిస్థిమితంలేక గతేడాది డిసెంబరు 20న విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరాడు. ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి ఏయూటీడీ షెల్టర్‌కు ఫోన్ చేసి అప్పగించారన్నారు.షెల్టర్‌లో వైద్యమందించిన తర్వాత తన పేరు, వివరాలు చెప్పాడన్నారు. ఆయన మానసిక పరిస్థితి సరిగ్గా లేకనాలుగు నెలల క్రితం ఇంటినుంచి పారిపోయి వైజాగ్ వచ్చేసినట్ట జ్యోతిర్మయి తెలిపారు. ఈ స్థితిలో డిఫూ జిల్లా మంజా గ్రామంలో ఉన్న అక్క,బావలకు నానాబసను అప్పగించారు.

గీతం సముద్ర తీర ఉత్సవం ప్రారంభం



బెలూన్లు వదిలి ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న గీతం వర్సిటీ రిజిస్ట్రార్ గుణశేఖరన్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 3 : గీతం వర్సిటీ యువతలో విజ్ఞాన నైపుణ్యాలతో పాటు సాంస్కృతిక, క్రీడలను ప్రోత్సహించడానికి ఏటా 'షోర్ ఫెస్ట్' పేరిట నిర్వహించే సముద్ర తీర ఉత్సవం శనివారం రుషికొండ తీరంలో ఘనంగా ప్రారంభమైంది. వందలాది మంది విద్యార్థులు ఉత్సవానికి హాజరయ్యారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ వివక్ష లేని సమాజం, ఆరోగ్యకరమైన జీవనం నుంచి నడవడిక అంశాలను ఉత్సవానికి నినాదంగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. కాగా ఉత్సవంలో భాగంగా భారత నౌకాదళం ఆధ్వర్యంలో వీనుల విందైన సంగీతాన్ని నేవీ బ్యాండ్ బృందం ఆలపించింది. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీభరత్, లైఫ్ డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన బుమ్రా

... 5వ పేజీ తరువాయి

ఓవర్‌లో పోప్‌ను పెవెలియన్‌కు పంపాడు. తొలి టెస్టులో 196 పరుగులు చేసిన పోప్ (23)..ఈ మ్యాచ్‌లో వికెట్ల ముందు పాతుకుపోతున్న సమయంలో బుమ్రా అవుట్ చేయడంతో స్టేడియం హర్షధ్వానాలతో మారుమోగింది. కొద్దిసేపటికే జానే బయిరెస్టో (25)ను కూడా బుమ్రా పెవిలియన్‌కు పంపడంతో ఇంగ్లండ్ 159 పరుగులకు ఐదు వికెట్లు పడిపోయి కష్టాల్లో పడింది. రెండో స్పెల్‌లో తిరిగి బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా అదే ఊపును కొనసాగించాడు. వ్యక్తిగత 47 పరుగులతో ఉన్న కెప్టెన్ బెన్ స్టోక్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ శిబిరం డీలాపడిపోయింది. బెన్ ఫోక్స్ (6), రెహన్ అహ్మద్ (6)లను కులదీప్ యాదవ్ పెవెలియన్‌కు పంపగా...చివరి బ్యాట్స్‌మెన్లు టామ్ హార్ట్‌లీ (21), అండర్సన్ (6)లను బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లంగ్ ఇన్నింగ్స్ 253 పరుగుల వద్ద ముగిసింది. బుమ్రా 6 వికెట్లు తీయగా, కుల్దీప్ 3, అక్షరపటేల్ ఒక వికెట్ తీసుకున్నారు. 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ, జైస్వాల్‌కు ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. రెండో రోజు ఆట ముగిసే సరికి భారత్ ఐదు ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 28 పరుగులు చేసింది. జైస్వాల్ 15, రోహిత్‌శర్మ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

జగదల్‌పూర్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3: భద్రతా ఆడిట్‌లో భాగంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ శనివారం జగదల్‌పూర్‌లో పర్యటించారు. ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ (ఓహెచ్‌ఈ), పాయిం ట్లు, లెవెల్ క్రాసింగ్‌లు, ట్రాక్ సర్క్యూట్, యార్డు లేఅవుట్, ట్రాక్ లు, రిలే గది, ఇతర భద్రతా అంశాలను తనిఖీ చేశారు. స్టేషన్ మా స్టర్, ఇతర సిబ్బందితో పలు అంశా లపై సమీక్షించారు. రైల్వే కాలనీలో పర్యటించి సదుపాయాల కల్పన, నిర్వహణపై నివాసితుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నక్తి సెమారా స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అధికారులు పాల్గొన్నారు.

సమన్వయకర్తే అభ్యర్థి అవుతారన్న గ్యారంటీ లేదు

... 5వ పేజీ తరువాయి

నాగిరెడ్డి వర్గీయులకు మింగుడుపడలేదు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన అనుయాయులతో ఆయన సమావేశమయ్యారు. టికెట్ విషయంలో ఎవరూ నిరుత్సాహ పడవద్దని, అంతా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశానికి టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డితో పాటు మరికొంతమంది కార్పొరేటర్‌లు, ముఖ్యనాయకులు హాజరయ్యారు. సమావేశంలో గాజువాక అభివృద్ధిపై కూడా మాట్లాడినప్పటికీ టికెట్ గురించే ప్రధానంగా చర్చ జరిగింది.

తండ్రికి అనారోగ్యం.. మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్య



దేదీప్ (ఫైల్‌ఫొటో)

మద్రిపాలెం, ఫిబ్రవరి 3: తండ్రికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో మనస్తాపానికి గురైన తనయుడు అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్రిపాలెం వుడా కాలనీలో శనివారం చోటు చేసుకుంది. దీనిపై ఎయిర్‌పోర్ట్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. వుడా కాలనీలోని సాయి మైత్రేయ ఎన్‌క్లేవ్‌లో బర్నికల దేదీప్ (23) తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా ఉద్యో గం చేస్తున్నారు. అయనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం ఆయనను చికిత్సకు ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. దేదీప్ అపార్ట్‌మెంట్‌పైకి వెళ్లి ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం మేరకు పోలీసులు వెంటనే చేరుకుని తీవ్రంగా గాయపడిన యువకుడిని సమీపంలో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెం దినట్టు నిర్ధారించారు. మృతుడు ఇంజనీరింగ్ పూర్తిచేసి గేట్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు నేతృత్వంలో హెచ్‌సీ యాదవ్ కేసు నమోదు చేశారు.

హత్యలకు దారితీస్తున్న భూవివాదాలు

... 5వ పేజీ తరువాయి

దుండగుడిని సీసీ టీవీ ఫుటేజీలో చూసిన పోలీసులు, రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఫుటే జీ కూడా పరిశీలిం చారు. ఆ వ్యక్తి నాలుగైదుసార్లు రమణయ్యను కలిసినట్టు గుర్తించారు. ఆ వ్యక్తితో గొడవ పడేంత వివాదం ఉంటే...రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వచ్చి తనతో మాట్లాడడానికి రమణయ్య అంగీకరించే అవకాశం లేదు. అందుకని సదరు నిందితుడు పథకం ప్రకారం రమణయ్యను ఇంట్లో నుంచి కిందకు రప్పించడానికి పంతులును ఉపయోగించాడేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతా కలిసే వచ్చారని కొందరు చెబుతున్నారు.

ఉలిక్కిపడిన నగరం

... 5వ పేజీ తరువాయి

ఖాళీ చేయాలని బెదిరించడంతో రెండు నెలల కిందటే ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రసాద్ బొండపల్లిలోని తమ భూమి వద్దకు వెళ్లి వాచ్‌మన్ ప్రకాష్ సెల్ నుంచి తనకు ఫోన్ చేసి భూమిలోకి వస్తే సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి చంపేస్తానని బెదిరించాడని ఆరోపించారు. తనను చంపేస్తాడేమోనని భయంతో తాను దాక్కొంటే తన సోదరుడైన రమణయ్యను చంపేశాడని, అలా జరుగుతుందని ఊహించలేదని అంటున్నాడు. దీంతో రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై స్పష్టత లేకుండాపోయింది.

ఎవరీ ప్రసాద్!

తన సోదరుడు, తహసీల్దార్ రమణయ్యను హత్య చేసింది ప్రసాదేనంటూ రాజేంద్ర ఆరోపిస్తుండడంతో అసలు...ఈ ప్రసాద్ ఎవరని ఆరా తీస్తున్నారు. పోలీసులు చెబుతున్న రియల్టర్, రాజేంద్ర ఆరోపిస్తున్న ప్రసాద్ ఒక్కరే అయి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మధురవాడలోని వుడా కాలనీలోని జువెల్ అపార్టుమెంట్‌లో ఉంటున్న గంగారాం ప్రసాద్ గతంలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేసి మానేశాడని సమాచారం. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. రుషికొండ (సర్వేనంబర్ 22)లో రెండు ఎకరాల భూమిలో ఇటీవల కొన్ని భవనాలు నిర్మించాడని, అందుకోసం భారీగా అప్పులు చేశాడని, ఇప్పుడు విక్రయించాలనుకునే సరికి కన్వేయన్స్ డీడ్ అవసరం పడడంతో దానికోసం తహసీల్దార్ రమణయ్యను ఆశ్రయించినట్టు సమాచారం. తాజాగా రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ కావడంతో ఆ పని తాను చేయలేనని రమణయ్య స్పష్టంచేయడంతో విచక్షణ కోల్పోయి హత్య చేసి ఉంటాడని కొంతమంది అనుమానిస్తున్నారు. అయితే ప్రసాద్ హత్య చేశాడా?, లేకపోతే వేరొకరితో హత్య చేయించాడా? అనే దానిపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు వివరాలను వెల్లడిస్తేనే గానీ హత్యకు గల కారణం, నిందితులు ఎవరనేది తెలిసే అవకాశం లేదు.

ఉద్యోగుల్లో ఆందోళన

... 5వ పేజీ తరువాయి

రాత్రి రమణయ్య నివాసం ఉంటున్న అపార్టుమెంట్ సెల్లార్‌లోనే అతడిపై నిందితుడు ఇనుపరాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ వార్త తెలిసిన వెంటనే కొందరు అధికారులు కొమ్మాదిలోని ఆయన నివాసానికి, మరికొందరు అపోలో ఆస్పత్రికి చేరుకున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డికి సమాచారం అందడంతో వెంటనే పోలీసులు, అపోలో వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అర్ధరాత్రి రెండుగంటల సమయంలో రమణయ్య మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించడంతో వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. కలెక్టర్, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే పోలీసులు కొమ్మాదిలోని రమణయ్య నివాసానికి చేరుకున్నారు.

కేజీహెచ్‌కు కలెక్టర్, అధికారులు

రమణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు అపోలో ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉదయం ఏడు గంటలకు కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, అధికారులు కేజీహెచ్ వద్దకు చేరుకున్నారు. రమణయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని సోదరుడు రోహిణీరావు, కుటుంబ సభ్యులు, రమణయ్య సతీమణి అనూష, బంధువుల రోదనలతో కేజీహెచ్ మార్చురీ వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. కేజీహెచ్ వద్దకు నగరంలోని రమణయ్య బంధువులు, భీమిలి, విశాఖ, విజయనగరం ఆర్డీవోలు భాస్కరరెడ్డి, హుస్సేన్‌సాహెబ్, సూర్యకళ, రెండు జిల్లాల తహసీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు త్రినాధరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, సభ్యులు, భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, రమణయ్య స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దిమిలాడ, పరిసర గ్రామాల వారు చేరుకున్నారు.

నివాళులర్పించిన నేతలు, అధికారులు

టీడీపీ నేతలు గంటా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, జనసేన నేతలు వంశీకృష్ణ శ్రీనివాస్, మూర్తియాదవ్, ఉషాకిరణ్ తదితరులు కేజీహెచ్‌లో రమణయ్య మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని, రమణయ్యను హత్య చేసిన దుండగులను శిక్షించాలని రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు నినాదాలు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లోకి ఎక్కించి కేజీహెచ్ అవుట్‌గేట్ వరకు రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు.

కలెక్టరేట్‌లో నిరసన

రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టరేట్ పోర్టికో వద్ద శనివారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. భూ మాఫియా నుంచి రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, రమణయ్య హత్య కారకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ మయూర అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. రమణయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలని, రూ.2 కోట్లు పరిహారం చెల్లించడంతో పాటు ప్రత్యేక కేసుగా పరిగణించి ఆయన సతీమణికి గ్రూప్-2 ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా నగరంలోని తహసీల్దారు కార్యాలయాలకు పోలీస్ భద్రత కల్పించాలని, ఉద్యోగులకు క్వార్టర్లు నిర్మించాలని కోరారు. భూ దందాలు అదుపు చేయడానికి ఐఏఎస్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు, భూ వివాదాలపై కోర్టుల్లో కేసులు వాదించడానికి బడ్జెట్ కేటాయించాలన్నారు. నగరంలో తహసీల్దారు కార్యాలయాలను డిప్యూటీ కలెక్టర్ స్థాయికి పెంచాలని, రెవెన్యూ ఉద్యోగులపై దాడులను తీవ్రంగా పరిగణించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సీపీ రవిశంకర్ అయ్యనార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో కలెక్టరేట్ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బెహరా రవిశంకర్, గ్రామ పాలనాధికారి సంఘం అధ్యక్షుడు వెంకట అప్పారావు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా రమణయ్య హత్యకు నిరసనగా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించారు.

ఆరు గంటల్లో గుర్తిస్తే ఎందుకు పట్టుకోలేదు?

... 5వ పేజీ తరువాయి

నుంచి ఆరు గంటల సమయం అంటే ఉదయం ఆరు గంటలకు నిందితుడి వివరాలు సేకరించారు. విమానంలో పారిపోవడానికి టికెట్ కొన్నాడని గుర్తించారు. మరి నిందితుడి వివరాలు విమానాశ్రయానికి పంపించి, అక్కడ ఎందుకు పట్టుకోలేకపోయారు?...అనే ప్రశ్నకు సమాధానం లేదు. ప్రస్తుతం విమానాశ్రయంలో రన్‌వేకు మరమ్మతులు జరుగుతున్నాయి. విమానాలు 8 గంటలకు బయలుదేరుతున్నాయి. శనివారం హైదరాబాద్ తొలి విమానం ఉదయం 8.30 గంటలకు బయలుదేరింది. పోలీసులకు ఆ సమాచారం ముందుగానే తెలిసి ఉంటే విమానం ఎక్కక ముందే నిందితుడిని పట్టుకునే అవకాశం ఉంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా అన్న క్యాంటీన్!

సాయంత్రమయ్యేసరికి మందుబాబుల అడ్డాలు

క్యాంటీన్ పరిసరాలు డంపింగ్ యార్డుగా మారిన వైనం

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిసర ప్రాంతాల ప్రజలు

ఆటోనగర్, ఫిబ్రవరి 3: తెలుగుదేశం పార్టీ హయాంలో ఆటోనగర్‌లో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సాయంత్రమయ్యే సరికి ఆకతాయిలు, పలువురు లారీ డ్రైవర్లు ఇక్కడకు చేరుకుని మద్యం సేవించడం, తదితర అసాంఘిక పనులకు పాల్పడుతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు చౌక ధరకు భోజనం,అల్పాహారం అందించాలనే సదుద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 సెప్టెంబర్ మూడున అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. కేవలం ఐదు రూపాయలకు రూ. ఇడ్లీ, పూరీ, ఉప్మా లేక పొంగల్, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజనం అందించడంతో నిరుపేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది. ఈ



డంపింగ్ యార్డును తలపిస్తున్న అన్న క్యాంటీన్ పరిసర ప్రాంతాలు

క్యాంటీన్‌కు వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం నగరానికి వచ్చినవారు, ఆస్పత్రుల్లో రోగులను పర్యవేక్షిస్తున్న వారి బంధువులు, దినసరి కూలీలకు ప్రయోజనకరంగా నిలిచేది. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్న క్యాంటీన్‌లను మూసివేసింది. దీంతో ఎంతోమంది చౌక భోజనం, అల్పాహారానికి దూరమయ్యారు.

ప్రస్తుతం ఇక్కడి అన్న క్యాంటీన్ భవనం నిరుపయోగంగా ఉండడంతో అసాంఘిక కార్యక లాపాలకు అడ్డాగా మారింది. క్యాంటీన్‌లోని ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలు, ఇతర ఉపకరణాలు, బెంచీలు, విలువైన టైల్స్ వంటి సామగ్రి చోరీకి గురయ్యాయి. భవనం పరిసరాలు చెత్త డంపింగ్ కేంద్రంగా మారింది. తరచూ ఇక్కడ పేరుకుపోయిన వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో పరిసర ప్రాంతాలన్నీ కాలుష్య కాసారంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపయోగంగా పడివున్న ఈ భవనాన్ని ఇతర అవసరాలకైనా వినియోగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



అన్న క్యాంటీన్ లోపల ఛిద్రంగా ఉన్న దృశ్యం

అధికారంలోకి వచ్చాక అన్న క్యాంటీన్లను వినియోగంలోకి తెస్తాం



టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణను పొందాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని ఎత్తివేయడంతో నిరుపేదలు ఆకలితో అలమటిస్తున్నారు. మరో మూడు నెలల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం రావడం తథ్యం. అప్పుడు మళ్లీ అన్నా క్యాంటీన్లను వినియోగంలోకి తీసుకువస్తాం.

-పల్లా శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

పేదలకు అండగా ఉంటాం

-బొండా జగన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వడ్లపూడి



అభివృద్ధి ప్రదాత టీడీపీ అధినేత చంద్రబాబు. ఆయన హయాంలో పేదల కోసం అమలు చేసిన సంక్షేమ పథకాల్లో అన్నా క్యాంటీన్ ఒకటి. అటువంటి వాటిని వైసీపీ ప్రభుత్వం మూసివేయడం దారుణం. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కాగానే అన్నా క్యాంటీన్లను తెరిచి పేదలకు అండగా ఉంటారు.

దినసరి కూలీలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేది..



ఆటోనగర్ అన్న క్యాంటీన్ భవన నిర్మాణ కార్మికులకు, లారీ డ్రైవర్లకు ఎంతో ఉపయోగపడేది. రుచితో కూడిన భోజనం, అల్పాహారం కేవలం రూ.5కే లభించేది. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన సుమారు రోజుకు మూడు వేల మంది నిత్యం దీనిని ఉపయోగించుకునేవారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని వినియోగంలోకి తేవాలని కోరుకుంటున్నాం.

-గుంట సూర్యనారాయణ,భవన నిర్మాణ కార్మికుడు, శ్రీనగర్



దీక్షా శిబిరంలో ప్రియాంక, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కేంద్రానికి సహకరిస్తున్న జగన్

ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే తమ ఎంపీలతో ఢిల్లీలో ఉక్కు ప్రైవేటీకరణ, ప్రత్యేక హోదాపై నిరాహార దీక్ష చేయించాలి

కాంగ్రెస్ పార్టీ నాయకురాలు దండి ప్రియాంక

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 3: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రానికి సీఎం జగన్ సహకరిస్తున్నారని, నిజంగా ఆయనకు చిత్తశుద్ధి కుంటే తమ ఎంపీలతో ఢిల్లీలో ఉక్కు కర్మాగారం, ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం నిరాహార దీక్ష చేయించాలని కాంగ్రెస్ ఆర్టీ నాయకురాలు దండి ప్రియాంక డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,087వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆమె దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపి ఒకరోజు సంఘీభావ దీక్షను చేపట్టారు. ఉక్కు కార్మికులను చులకనగా చూస్తున్నారని, మూడేళ్లుగా దీక్షలు చేస్తున్నా బీజేపీ నాయకులకు చీమ కుట్టినట్టయినా లేదని విమర్శించారు. కార్పొరేట్లకు ఉక్కు కర్మాగారాన్ని విక్రయించకుండా ఉండాలంటే బీజేపీ రాష్ట్ర నాయకులకు కార్మికుల ఆగ్రహ జ్వాలలను చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, డి.శ్రీనివాస్, సన్యాసిరావు, జగన్ మురారి, గోపి, ప్రసాద్, పి.సోమినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'పాదయాత్రను విజయవంతం చేయండి'

ఆటోనగర్, ఫిబ్రవరి 3: జనం వద్దకు జనసేన అంటూ ఆదివారం 70వ వార్డులో నాయకురాలు లంకల మురళీదేవి ఆధ్వర్యంలో చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు కోరారు. శ్రీనగర్‌లోని జనసేన కార్యాలయంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు రక్షణ కావాలంటే రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవలసిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, కేవీ సూరిబాబు, చిరంజీవి, కె.కనకారావు, కాదా శ్రీను, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీబీఎల్ దివ్యక్షేత్రంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 3: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని శ్రీవారికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువ జామున స్వామివారికి పంచామృతాలతో అభిషేకించాక తోమాలసేవ జరిపారు. సాయంత్రం ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఉభయ దేవేరులతో శ్రీవారు

వాంబే కాలనీలో తులసీ దళార్చన

పెదగంట్యాడ: ఇక్కడి వాంబే కాలనీలోని స్వయంభు వేంకటేశ్వరాలయంలో శనివారం స్వామి వారికి తులసీ దళార్చన, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి సుప్రభాత సేవ అనంతరం పూజలు జరిపారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధనను చేపట్టారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, సింహాచల దేవస్థానం ట్రస్టీ దొడ్డి రమణ, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతెన్నెలపై తాబేళ్ల కళేబరాళ్లు

యారాడ తీరంలో తాబేళ్ల మృత్యువాత

సింధియా, ఫిబ్రవరి 3: యారాడ సముద్ర తీరంలో సుమారు ఇరవై తాబేళ్లు మృతి చెందాయి. తీరంలోని ఇసుకతెన్నెలపై పలుచోట్ల భారీ తాబేళ్ల కళేబరాలను చూసి సందర్శకులు, మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. సముద్ర జలాలు కలుషితమవ్వడం వల్లే తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయని పలువురు మత్స్యకారులు చెబుతున్నారు. సముద్ర జలాలు కలుషితం కాకుండా ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేత్ర వైద్య శిబిరానికి మంచి స్పందన

అగనంపూడి, ఫిబ్రవరి 3: జీవీఎంసీ 85వ వార్డు పరిధి దిబ్బపాలెంలో లయన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రథమ క్లినిక్, విజన్ కేర్ సౌజన్యంతో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఏరియా ఆస్పత్రి డాక్టర్ కళావతి ప్రారంభించిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి నేత్ర పరీక్షలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కేజీ నాయుడు, గుదే సుశీలగజేంద్రరావు, హనుమంతరావు, వెంకటరమణ, మస్తాన్‌రెడ్డి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు గుర్తింపు

నేతలు పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్

అగనంపూడి, ఫిబ్రవరి 3: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే బీసీలు అన్ని రంగాలలో గుర్తింపు పొందారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం.శ్రీభరత్‌లు పేర్కొన్నారు. పెదమడకలోని రాజీవ్‌గాంధీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. టీడీపీని ఆవిర్భవించి అధికారంలోకి వచ్చిన వెంటనే దివంగత ఎన్టీ రామారావు బీసీలకు 24 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. బీసీలకు రాజ్యాధికారం, లబ్ధి చేకూర్చేందుకు టీడీపీ కృషి చేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు తగిన న్యాయం జరగలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా కోట్లాది రూపాయలు రుణాలను అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం బీసీల కోసం కనీసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు. నాడు ఆదరణ పథకం ద్వారా చంద్రబాబు బీసీ సంక్షేమానికి ఎంతో పాటుపడ్డారని వారు రానున్న ఎన్నికల్లో టీడీపీని అధికారంలోకి తీసుకువస్తే బీసీలకు అన్ని విధాల మేలు జరుగుతుందన్నారు. అనంతరం శ్రీభరత్‌ను పల్లా శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, మొల్లి ముత్యాలు, టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర, నాయకులు విజయకుమార్, నూకరాజు, వి.శ్రీనివాస్, శివప్రసాద్, రాజు, అప్పారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో అభివాదం చేస్తున్న పల్లా శ్రీనివాసరావు, శ్రీభరత్, టీడీపీ, బీసీ నాయకులు

వైసీపీ కుట్రలకు ఓటుతో బుద్ధి చెప్పండి: ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: రాష్ట్ర ప్రజలంతా అప్రమత్తంగా ఉంటూ రానున్న ఎన్నికల్లో వైసీపీ కుట్రలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) సూచించారు. మల్కాపురం పల్లెవీధిలో శనివారం సాయంత్రం టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగిపోతున్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకి పోలిరెడ్డి, జయశంకర్, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, మురళి, జోగి, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రి జోలికొస్తే తరిమికొడతాం

సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరాం

తక్షణమే ఆ యోచనను విరమించాలని డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి జోలికొస్తే ఎంతటి వారినైనా తరిమికొడతామని సీఐటీయూ ప్లాంట్ గౌరవ అధ్యక్షుడు జె.అయోధ్యరాం హెచ్చరించారు. ఉక్కు ఆస్పత్రి ప్రైవేటీకరణ నేపథ్యంలో సీఐటీయూ, మిత్రపక్షాల ఆధ్వర్యంలో శనివారం ఆస్పత్రి ముందు భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికే మణిహారంలాంటి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తుండడాన్ని కార్మిక వర్గం అడ్డుకోవడంతో ఒక్కొక్క విభాగాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఈ క్రమంలో వేలాది మంది ఉక్కు ఉద్యోగులు, కుటుంబ సభ్యులు, పదవీ విరమణ చేసిన వారికి వైద్య సేవలందిస్తున్న ఆస్పత్రిని ప్రైవేటు వారికి అప్పగించేందుకు కుట్ర చేస్తుండడం దారుణమని, తక్షణమే దీనిని వెనక్కి తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. ఉక్కు యాజమాన్యం దుర్మార్గ ఆలోచనలను వీడి సంస్థ ప్రగతి, కార్మిక సంక్షేమంపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ఉక్కు ఆస్పత్రి భూములను కారుచౌకగా కార్పొరేట్ ఆస్పత్రులకు అప్పగించేందుకు చేస్తున్న యత్నాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. ఇప్పటికే ఆస్పత్రిలో వైద్య సేవల విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని, ఇదే క్రమంలో ఆస్పత్రిని ప్రైవేటీకరిస్తే సహించేది లేదన్నారు. అధ్యక్షుడు యు.రామస్వామి మాట్లాడుతూ కార్మికుల సహనాన్ని ఉక్కు యాజమాన్యం చేతకానితనంగా తీసుకోరాదని, ఆస్పత్రి జోలికొస్తే తరిమికొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్.రామారావు, సీహెచ్ సన్యాసిరావు, శ్రీనివాస్, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ముందు ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 30, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 16,క్యారెట్ 24, దొండకాయలు 32, బంగాళదుంపలు 20, అరటికాయ (పెద్దది) 4, అల్లం (పాతది) 115, మునక్కాడలు (కిలో) 95, బరబాటి 26, ముల్లంగి 18, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 360, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 52 , ఆగాకర 84, పొటల్స్ 62, కీర దోస 32, క్యాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28, కంద 54, దేముడుచిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	97
ఫారం ధర	--	117
విత్ స్కిన్	--	204
స్కిన్‌లెస్	--	214

మరికొన్ని సిటీ వార్తలు | పేజీ Iలో..

నేరాలకు నిలయంగా మారుతున్న విశాఖ

'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు



గోపాలపట్నం, ఫిబ్రవరి 3: ప్రశాంతతకు నిలయమైన విశాఖ నగరం ఇప్పుడు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేరాలకు నిలయంగా మారిందని 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని తమ నివాసంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో శాంతియుతమైన వాతావరణంలో ఉండే విశాఖ నగరంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రజలు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. పెట్టుబడుదారులకు కూడా విశాఖ ఎంతో అనుకూలమైన ప్రాంతంగా మారిందన్నారు. అయితే వైసీపీ పాలనలో నేరాలకు నిలయంగా విశాఖ మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని నెలల క్రితం విశాఖ ఎంపీ కుమారుడితో పాటు పలువురు కిడ్నాప్‌నకు గురైతే. తాజాగా తహసీల్దార్ హత్యకు గురవ్వడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలోనూ నేరాలు పెరగడంతో పాటు యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థను దృఢపరచడంతో పాటు శాంతిభద్రతలను నెలకొల్పడంలో సీఎం జగన్ విఫలమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గణబాబు డిమాండ్ చేశారు.

భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలి

గాజువాక, ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాజువాక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం న్యాయవాదులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టాన్ని రద్దు చేసేంత వరకు పోరాటాలు చేస్తామని, ఈ చట్టం వల్ల అన్నివిధాల అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది వెన్నెల ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్

కళంజియా మహిళల వాక్‌థాన్

మల్కాపురం, ఫిబ్రవరి 3: మల్కాపురం కళంజియా సమాఖ్య ఆధ్వర్యంలో సామానిక క్రమం వైపు అనే అంశంపై శనివారం వాక్‌థాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపం నుంచి ప్రదర్శనగా జనతా కాలనీ దుర్గాదేవి ఆలయం మీదుగా గౌరీపరమేశ్వరి ఆలయం వరకు సాగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బ్యాంక్ ఆఫ్ ఇండియా గాజువాక బీఎం సుధీర్ మాట్లాడుతూ కళంజియా మహిళలంతా క్రమశిక్షణగా ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేస్తుండడం అభినందనీయమన్నారు. వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్‌కు చెందిన రమాప్రభ, వైజాగ్ రీజనల్ కో-ఆర్డినేటర్ రామ్‌కుమార్,ధనలక్ష్మి, లోకేశ్, రజని, ఆదిలక్ష్మి, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందితో ఈఆర్‌వో సమావేశం

గాజువాక, ఫిబ్రవరి 3: ఎన్నికల సిబ్బందితో గాజువాక నియోజకవర్గ ఈఆర్‌వో డి.లక్ష్మారెడ్డి శనివారం గాజువాక జోనల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఏ పోలింగ్ బూత్ వద్ద కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఎక్కడైన ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమ్మెకు ఉక్కు కాంట్రాక్టు కార్మికుల మద్దతు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 16న చేపట్టనున్న కార్మిక సమ్మెలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొంటారని పేర్కొంటూ ఉక్కు యాజమాన్యానికి అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మె చేస్తున్నామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలనే ఉంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్టు పేర్కొన్నారు. నోటీసు ఇచ్చిన వారిలో నాయకులు మంత్రి రవి, పిట్టా రెడ్డి, తదితరులు ఉన్నారు.

జనసేన పార్టీలో పలువురు చేరిక

సింధియా, ఫిబ్రవరి 3: జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గం సమన్వయకర్త అంగ దుర్గా ప్రశాంతి సమక్షంలో 63వ వార్డుకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో ఆ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.శివ, నానాజీ, లలిత, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

9 నుంచి బీజేపీ 'పల్లెకు పోదాం'


గాజువాక, ఫిబ్రవరి 3: గ్రామ స్థాయి నుంచి పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు గాను ఈ నెల తొమ్మిది నుంచి మూడు రోజుల పాటు నియోజకవర్గంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర పేర్కొన్నారు. గాజువాకలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం చేసిన అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నట్టు ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. నాయకులు సొంబాబు, గూటూరు శంకరరావు, దీనంకొండ కృష్ణంరాజు,నూకరాజు, యల్లాజీరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు నిత్యావసర సరకులు పంపిణీ

అగనంపూడి, ఫిబ్రవరి 3: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం స్థానికంగా పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. పలు పేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరకులతో పాటు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇకపై ప్రతినెలా పేదలకు సేవా కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికను రూపొందించుకున్నట్టు వారు పేర్కొన్నారు.


గ్రామీణ వైద్యుల సేవలు అవసరం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 3: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేటలో శనివారం గ్రామీణ వైద్య సేవల అంశంపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామీణ వైద్యుల సేవలు ఎంతో ముఖ్యమని, వారి సేవలు ప్రజలకు ఎంతో విలువైనవన్నారు. అర్ధరాత్రి అయినా ఆపదలో ఉంటే వైద్యం అందించేవారు ఆర్‌ఎంపీలని పేర్కొన్నారు. డబ్బుల కోసం వారు పట్టించుకోరని, కేవలం వైద్యం అందించడమే వారి ధ్యేయమన్నారు. ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు జంగం జోషి మాట్లాడుతూ ఏ సమయంలోనైనా డబ్బు కోసం చూడకుండా రోగి ప్రాణాలే ముఖ్యమని భావిస్తూ తాము వైద్యం అందిస్తామన్నారు. గ్రామ పెద్దలు చిల్లా ఉమామహేశ్వరరావు, అను, ఈశ్వరరావు, స్థానిక ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న గ్రామ పెద్దలు, ఆర్‌ఎంపీలు

తహసీల్దార్‌గా భాస్కరరావు బాధ్యతలు స్వీకరణ



పెదగంట్యాడ, ఫిబ్రవరి 3: పెదగంట్యాడ మండల తహశీల్దారుగా ఐ భాస్కరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా పూసపాటి రేగ మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ తహశీల్దారుగా పనిచేసిన రమాదేవి విజయనగరానికి బదిలీ అయ్యారు.

గోపాలపట్నం తహసీల్దార్‌గా విజయభాస్కర్..

ఎన్.ఎ.డి.జంక్షన్: గోపాలపట్నం తహసీల్దార్‌గా పి.విజయభాస్కర్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ సువర్ణబాయి, సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కారానికి ఉద్యోగులంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

96వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెందుర్తి, ఫిబ్రవరి 3: జీవీఎంసీ 96వ వార్డు పరిధిలో రూ 2.2 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. వెంకటాద్రి శిఖరంపై గల వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి దిగువ వరకు ఘాట్ రోడ్డు నిర్మాణానికి, పెందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్ వరకు నిర్మించే తారురోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ ముమ్మన దేవుడు, వైసీపీ వార్డు అధ్యక్షుడు దాడి ఉమామహేశ్వరరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు వేగి పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో..

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి పురుషోత్తపురం మహతి స్కూల్ నుంచి కరపాట్ హోమ్స్ వరకు చేపట్టిన తారురోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. కార్పొరేటర్ దేముడు వార్డులోని పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.

ఎట్టకేలకు సర్వీస్ రోడ్డుకు మోక్షం

వేపగుంట, ఫిబ్రవరి 3: జీవీఎంసీ 98వ వార్డు పరిధి బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి అప్పన్నపాలెం, భరత్‌నగర్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ సర్వీస్ రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై అధికారులు స్పందించి ఇక్కడ తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. అలాగే పంచాయతీ కాలనీకి వెళ్లే మార్గంలోని గోతులకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కాలనీ అభివృద్ధికి అందరూ సహకరించాలి

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 3: కాలనీలో అభివృద్ధి పనులకు ప్రజలందరూ సహకరించాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. వార్డులోని హరిజన జగ్గయ్యపాలెం, మాజీ సైనికుల కాలనీల్లో శనివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హరిజన జగ్గయ్యపాలెలో శిథిల స్థితికి చేరుకున్న మురుగు కాలువను రూ.30 లక్షలతో ఆధునీకరించనున్నామన్నారు. ఆయన వెంట కాలనీ నాయకులు వంగలపూడి గోపి, జి.రామాంజనేయులు, పెట్లి అప్పారావు, పి.రవి, ఎం.ఆనంద్, టి.నరసింగరావు, టి.వసంత్, తదితరులు పాల్గొన్నారు.

'దళారులకు కూరగాయలు విక్రయించొద్దు'



గుర్తింపు కార్డులందజేస్తున్న ఏడీ యాసిన్

కంచరపాలెం, ఫిబ్రవరి 3 : రైతు బజారులో కూరగాయలను దళారులకు విక్రయించరాదని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ ఏడీ యాసిన్ అన్నారు. శనివారం స్థానిక రైతుబజారును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.ఎస్టేట్ అధికారి, సీహెచ్.కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

'పశ్చిమం' నుంచి పోటీకి 'పాశర్ల' దరఖాస్తు

మహారాణిపేట: పశ్చిమ నియోజకవర్గనుంచి టీడీపీ తరపున పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నట్టు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్ తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఈమేరకు దరఖాస్తు అందించి, తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని ఆయన కోరారు.

తహసీల్దార్ హత్య దారుణం

- ఈ కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలి
- నగరంలో రాజారెడ్డి రాజ్యాంగం అమలు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

మహారాణిపేట, ఫిబ్రవరి 3: వైసీపీ పాలనలో ప్రశాంతమైన విశాఖ నగరంలో హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలువిపరీతంగా పెరిగిపోతున్నాయని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ నగరంలో రాజారెడ్డి రాజ్యాంగం, పులివెందుల పంచాయితీ అమలు చేస్తున్నారన్నారు. ఎవరైనా ఏదైనా అంశాన్ని వ్యతిరేకిస్తే చంపేస్తున్నారని ఆరోపించారు. విశాఖలో గతంలో ఎన్నడూ జరగని విధంగా ఓ మండల మెజిస్ట్రేట్ఇంటికి వెళ్లి ఆయనను చంపేయడం దారుణమన్నారు. తహసీల్దార్‌ను హత్య చేసిన వ్యక్తిని వైసీపీకి చెందిన వ్యక్తిగా తెలుస్తోందని ఆయన ఆరోపించారు. ఈ హత్యతో విశాఖ ప్రజలు వణికిపోతున్నార న్నారు. వైసీపీ నాయకులు అధికారులతో తప్పులు చేయి స్తున్నారని, వాటి పర్యావసనమే తహసీల్దార్ హత్య అని విమర్శించారు. అవినీతిని ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ ఉదంతంతో వైసీపీ నేతలు, సీఎం జగన్ మోహనరెడ్డి సిగ్గు పడాలన్నారు. ఇకనైనా, తహసీల్దార్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఇన్ చార్జిలు కోరాడ రాజబాబు, గండిబాబ్జీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్,టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్, పాశర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పల్లా, సమావేశంలో ఇన్‌చార్జిలు గండి బాబ్జీ, రాజబాబు

16న సమ్మె విజయవంతం చేయాలి

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 3 : దేశవ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న నిర్వహిస్తున్న పారిశ్రామిక సమ్మెలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని యూనియన్‌ప్రధాన కార్యదర్శి సాగర్ కోరారు. శనివారం బీఎస్ఎన్ఎల్ ఆఫీస్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుందన్నారు. బీఎస్ఎన్ఎల్‌కు కాకుండా 5జీలను ప్రైవేట్ కంపెనీలను రియలన్స్‌కు కేటాయించడం దుర్మార్గమన్నారు. బీఎస్ఎన్ఎల్ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం ఒక్క బీఎస్ఎన్ఎల్‌నే కాకుండా దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెబుతోందన్నారు.సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు లచ్చిరాజు , అష్రఫ్, రామాంజనేయులు, ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేందుకు కృషి

సీతమ్మధార, ఫిబ్రవరి 3: జాతీయ భావాలను కాపాడడంతోపాటు విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుతామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నేతలు, ఉపాధ్యాయులు అన్నారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మునిసిపల్ హై స్కూల్‌లో సంఘం ఆవిర్భావ దినోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, జాతీయ భావాలు కలిగిన పౌరులుగా తయారు చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందనే భావనతో 1982 ఫిబ్రవరి 2న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భవించినట్టు సంఘం విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రినాధమూర్తి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరామప్రసాద్, జిల్లా మహిళా కార్యదర్శి రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

బూత్ ఏజెంట్లతో సమావేశం

సీతమ్మధార, ఫిబ్రవరి 3: గ్రేటర్ 24వ వార్డులో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో పోలింగ్ బూత్ ఏజెంట్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర నెడ్‌క్యాప్ ఛైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు మాట్లాడారు. ఈ సందర్భంగా పండగ కానుకగా నూతన దుస్తులు పంపిణీ చేశారు.

జగన్ పాలనను అంతమొందించాలి

- మహిళా సదస్సులో జనసేన ఇన్‌చార్జి ఉషాకిరణ్

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 3:మహిళలు రాజకీయ చైతన్యంతో జగన్ దుర్మార్గ పాలనను అంతమొందించాలని ఉత్తర నియోజకవర్గం ఇన్‌చార్జ్ పసుపులేటి ఉషాకిరణ్ పిలుపునిచ్చారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా 43వ వార్డు మహిళా అధ్యక్షురాలు గారపాటి లక్ష్మి అధ్యక్షతన శనివారం సాయంత్రం చెక్కుడురాయి బిల్డింగ్ ప్రాంతంలో మహిళా సదస్సు జరిగింది. ఈ మేరకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు ఆకర్షితులై పలువురు మహిళలు ఆపార్టీ చేరారు. పసుపులేటి ఉషాకిరణ్ మహిళలకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 42వ వార్డు అధ్యక్షురాలు ముమ్మిన నాగమణి, 54వ వార్డు అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్, 44వ వార్డు అధ్యక్షురాలు హేమ కల్యాణి, ఉండమట్ల వరలక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉషాకిరణ్

ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే పార్టీకే మద్దతు

- మక్కా మసీద్ అధ్యక్షుడు షేక్ మున్నీర్

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 3: విశాఖలో ముస్లింలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించిన పార్టీకే తమ మద్దతు ఉం టుందని మక్కా మసీద్ అధ్యక్షుడు షేక్ మున్నీర్ కోరారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగరానికి చెందిన పది మసీదులకు చెందిన ముస్లిం వర్గానికి చెందిన నేతలు పాల్గొని మాట్లాడారు. ఉత్తరాంధ్రలో 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయన్నారు. 1994లో ఎస్‌ఏ రెహమాన్‌ను గెలిపించామన్నారు. విశాఖలో 1972లోనూ ముస్లిం నేత గెలిచినట్టు గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా జనాభాలో రెండోస్థానంలో ఉన్నా తమకు చట్ట సభల్లో తగిన ప్రాతినిధ్యంలేదని విచారం వ్యక్తంచేశారు. ముస్లిం నేత బాబు మాట్లాడుతూ దక్షిణ , ఉత్తరనియోజకవర్గాల్లో ముస్లిం నేతలకు టికెట్లు ఇవ్వాలని కోరారు. నాయకులు సనావుల్లా, జమీల్ అహ్మద్, అబ్దుల్ రహీమ్, అబ్దుల్ అజీజ్, అహ్మద్‌తుల్లా, రవూఫ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ఉచితంగా గర్భాశయ కేన్సర్ నిరోధక వ్యాక్సిన్లు

మహారాణిపేట, ఫిబ్రవరి 3: మహిళలకు గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తున్నట్టు చైతన్యస్రవంతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షు రాలు షరీనా రహమాన్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినం సందర్భంగా శనివారం కేజీహెచ్‌లో చైతన్యస్రవంతి స్వచ్ఛంద సంస్థ, కేజీహెచ్ రేడియాలజీ, క్యాన్సర్ విభాగాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు శనివారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 9 నుంచి 14 ఏళ్ల ఆడ పిల్లలకు ఉచితంగా రెండుసార్లు వ్యాక్సిన్లు వేస్తామన్నారు. వివాహం అయిన వారికి మూడుసార్లు అందిస్తామన్నారు. వైద్య పరీక్షల ద్వారా క్యాన్సర్ తొలిదశలో గుర్తించి తగిన చికిత్స అందజేసే వీలుంటుందని వైద్యులు సూచించారు. ఈ కార్యక్ర మంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. అశోక్ కుమార్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ శిల్ప తదితరులు పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి తెలిపారు. ముఖ్య అతిథిగా డా.రాకేష్‌రెడ్డి బోయ మహిళల్లో ప్రధానంగా వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ తదితర లక్షణాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వై.లక్ష్మి, ఎ.జ్యోతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి వరలక్ష్మి, అధ్యాపకులు డి.లక్ష్మన్నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ధర్నా

సిరిపురం, ఫిబ్రవరి 3 : విశాఖ రైల్వే జోన్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వ నిర్ల క్ష్యాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ మాట్లాడుతూ కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వనీ వైష్ణవ్ పార్లమెంట్‌లో రైల్వే జోన్ జాప్యానికి ఏపీ ప్రభుత్వం భూమి కేటాయించకపోవడమే కారణమని స్పష్టం చేశారన్నారు. కానీ జిల్లా కలెక్టర్ మాత్రం తాము భూమి కేటాయించినా రైల్వే అధికారులు తీసుకోలేదనడం అవాస్తవమని చెప్పారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి సూచన మేరకు శాంతియుతంగా ధర్నా చేస్తున్న కార్యకర్తలను అరెస్టు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. విష్ణుకుమార్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రమోహన్, విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుహాసినీ ఆనంద్, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు దిలీప్‌నాయుడు, పొలిమేర శ్రీను, నాగరాజు, రామమోహన్, దామోదర్ యాదవ్ పాల్గొన్నారు.

గంజాయి సీజ్...నలుగురి అరెస్టు

సీతంపేట, ఫిబ్రవరి 3: ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి రామాటాకీస్ రోడ్డులో ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేశారు. ఈ అక్రమ రవాణాపై ముందుగా సమాచారమందడంతో దాడి చేశారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగకు చెందిన చాపల దుర్గారావు, డీశెట్టి భానోజీ, ఇనుపకుర్తి నరేంద్ర, ఎం. శ్రీనివాసరావులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని ద్వారకా పోలీసు స్టేషన్‌కి అప్పగించారు. సీఐ ఎస్.రమేశ్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రికి అనారోగ్యం.. మనస్తాపంతో కుమారుడు ఆత్మహత్య

మద్రిపాలెం, ఫిబ్రవరి 3: తండ్రికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో మనస్తాపానికి గురైన తనయుడు అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మద్రిపాలెం వుడా కాలనీలో శనివారం చోటు చేసుకుంది. దీనిపై ఎయిర్‌పోర్ట్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.. వుడా కాలనీలోని సాయి మైత్రేయ ఎన్‌క్లేవ్‌లో బర్నికల దేదీప్ (23) తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. తండ్రి శ్రీనివాసరావు ప్రభుత్వ ఐటీఐలో ట్రైనింగ్ ఆఫీసర్‌గా ఉద్యో గం చేస్తున్నారు. ఆయనకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రికి తీసుకువెళ్లి పలు వైద్య పరీక్షలు నిర్వహించారు. శనివారం ఆయనను చికిత్సకు ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతుండగా.. దేదీప్ అపార్ట్‌మెంట్‌పైకి వెళ్లి ఐదో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం మేరకు పోలీసులు వెంటనే చేరుకుని తీవ్రంగా గాయపడిన యువకుడిని సమీపంలో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే మృతి చెం దినట్టు నిర్ధారించారు. మృతుడు ఇంజనీరింగ్ పూర్తిచేసి గేట్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు.మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ చక్రధరరావు నేతృత్వంలో హెచ్‌సీ యాదవ్ కేసు నమోదు చేశారు.



దేదీప్ (ఫైల్‌ఫొటో)

హత్యలకు దారితీస్తున్న భూవివాదాలు

... 5వ పేజీ తరువాయి

దుండగుడిని సీసీ టీవీ ఫుటేజీలో చూసిన పోలీసులు, రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఫుటే జీ కూడా పరిశీలిం చారు. ఆ వ్యక్తి నాలుగైదుసార్లు రమణయ్యను కలిసినట్టు గుర్తించారు. ఆ వ్యక్తితో గొడవ పడేంత వివాదం ఉంటే...రాత్రి పది గంటల సమయంలో ఇంటికి వచ్చి తనతో మాట్లాడడానికి రమణయ్య అంగీకరించే అవకాశం లేదు. అందుకని సదరు నిందితుడు పథకం ప్రకారం రమణయ్యను ఇంట్లో నుంచి కిందకు రప్పించడానికి పంతులును ఉపయోగించాడేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతా కలిసే వచ్చారని కొందరు చెబుతున్నారు.

ఉలిక్కిపడిన నగరం

... 5వ పేజీ తరువాయి

ఖాళీ చేయాలని బెదిరించడంతో రెండు నెలల కిందటే ఎంవీపీ కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశానని వెల్లడించారు. తాజాగా శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ప్రసాద్ బొండపల్లిలోని తమ భూమి వద్దకు వెళ్లి వాచ్‌మన్ ప్రకాష్ సెల్ నుంచి తనకు ఫోన్ చేసి భూమిలోకి వస్తే సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి చంపేస్తానని బెదిరించాడని ఆరోపించారు. తనను చంపేస్తాడేమోనని భయంతో తాను దాక్కొంటే తన సోదరుడైన రమణయ్యను చంపేశాడని, అలా జరుగుతుందని ఊహించలేదని అంటున్నాడు. దీంతో రమణయ్య హత్యకు కారణం ఏమిటనే దానిపై స్పష్టత లేకుండాపోయింది.

ఎవరీ ప్రసాద్!

తన సోదరుడు, తహసీల్దార్ రమణయ్యను హత్య చేసింది ప్రసాదేనంటూ రాజేంద్ర ఆరోపిస్తుండడంతో అసలు...ఈ ప్రసాద్ ఎవరని ఆరా తీస్తున్నారు. పోలీసులు చెబుతున్న రియల్టర్, రాజేంద్ర ఆరోపిస్తున్న ప్రసాద్ ఒక్కరే అయి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మధురవాడలోని వుడా కాలనీలోని జువెల్ అపార్టుమెంట్‌లో ఉంటున్న గంగారాం ప్రసాద్ గతంలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేసి మానేశాడని సమాచారం. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా పనిచేస్తున్నాడు. రుషికొండ (సర్వేనంబర్ 22)లో రెండు ఎకరాల భూమిలో ఇటీవల కొన్ని భవనాలు నిర్మించాడని, అందుకోసం భారీగా అప్పులు చేశాడని, ఇప్పుడు విక్రయించాలనుకునే సరికి కన్వేయన్స్ డీడ్ అవసరం పడడంతో దానికోసం తహసీల్దార్ రమణయ్యను ఆశ్రయించినట్టు సమాచారం. తాజాగా రమణయ్యకు విజయనగరం జిల్లా బొండపల్లి మండలానికి బదిలీ కావడంతో ఆ పని తాను చేయలేనని రమణయ్య స్పష్టంచేయడంతో విచక్షణ కోల్పోయి హత్య చేసి ఉంటాడని కొంతమంది అనుమానిస్తున్నారు. అయితే ప్రసాద్ హత్య చేశాడా?, లేకపోతే వేరొకరితో హత్య చేయించాడా? అనే దానిపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు వివరాలను వెల్లడిస్తేనే గానీ హత్యకు గల కారణం, నిందితులు ఎవరనేది తెలిసే అవకాశం లేదు.

ఉద్యోగుల్లో ఆందోళన

... 5వ పేజీ తరువాయి

రాత్రి రమణయ్య నివాసం ఉంటున్న అపార్టుమెంట్ సెల్లార్‌లోనే అతడిపై నిందితుడు ఇనుపరాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ వార్త తెలిసిన వెంటనే కొందరు అధికారులు కొమ్మాదిలోని ఆయన నివాసానికి, మరికొందరు అపోలో ఆస్పత్రికి చేరుకున్నారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డికి సమాచారం అందడంతో వెంటనే పోలీసులు, అపోలో వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్స అందించాలని కోరారు. అర్ధరాత్రి రెండుగంటల సమయంలో రమణయ్య మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించడంతో వెంటనే ఆస్పత్రికి చేరుకున్నారు. కలెక్టర్, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే పోలీసులు కొమ్మాదిలోని రమణయ్య నివాసానికి చేరుకున్నారు.

కేజీహెచ్‌కు కలెక్టర్, అధికారులు

రమణయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు అపోలో ఆస్పత్రి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉదయం ఏడు గంటలకు కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, అధికారులు కేజీహెచ్ వద్దకు చేరుకున్నారు. రమణయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అతని సోదరుడు రోహిణిరావు, కుటుంబ సభ్యులు, రమణయ్య సతీమణి అనూష, బంధువుల రోదనలతో కేజీహెచ్ మార్చురీ వద్ద విషాదఛాయలు అలముకున్నాయి. కేజీహెచ్ వద్దకు నగరంలోని రమణయ్య బంధువులు, భీమిలి, విశాఖ, విజయనగరం ఆర్డీవోలు భాస్కరరెడ్డి, హుస్సేన్‌సాహెబ్, సూర్యకళ, రెండు జిల్లాల తహసీల్దార్లు, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి, ప్రస్తుత అధ్యక్షుడు త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి రమేష్, సభ్యులు, భీమిలి టీడీపీ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, పద్మనాభం జడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, రమణయ్య స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం దిమిలాడ, పరిసర గ్రామాల వారు చేరుకున్నారు.

నివాళులర్పించిన నేతలు, అధికారులు

టీడీపీ నేతలు గంటా శ్రీనివాసరావు, గండి బాబ్జీ, జనసేన నేతలు వంశీకృష్ణ శ్రీనివాస్, మూర్తియాదవ్, ఉషాకిరణ్ తదితరులు కేజీహెచ్‌లో రమణయ్య మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. రెవెన్యూ అధికారులకు రక్షణ కల్పించాలని, రమణయ్యను హత్య చేసిన దుండగులను శిక్షించాలని రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు నినాదాలు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లోకి ఎక్కించి కేజీహెచ్ అవుట్‌గేట్ వరకు రెవెన్యూ ఉద్యోగులు ర్యాలీగా వెళ్లి నివాళులర్పించారు.

కలెక్టరేట్‌లో నిరసన

రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టరేట్ పోర్టికో వద్ద శనివారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. భూ మాఫియా నుంచి రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, రమణయ్య హత్య కారకులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అంతకుముందు జాయింట్ కలెక్టర్ మయూర అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. రమణయ్య కుటుంబానికి రక్షణ కల్పించాలని, రూ.2 కోట్లు పరిహారం చెల్లించడంతో పాటు ప్రత్యేక కేసుగా పరిగణించి ఆయన సతీమణికి గ్రూప్-2 ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అంతేకాకుండా నగరంలోని తహసీల్దారు కార్యాలయాలకు పోలీస్ భద్రత కల్పించాలని, ఉద్యోగులకు క్వార్టర్లు నిర్మించాలని కోరారు. భూ దందాలు అదుపు చేయడానికి ఐఏఎస్ అధికారి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేయాలని, ప్రభుత్వ భూముల్లో ఆక్రమణల తొలగింపు, భూ వివాదాలపై కోర్టుల్లో కేసులు వాదించడానికి బడ్జెట్ కేటాయించాలన్నారు. నగరంలో తహసీల్దారు కార్యాలయాలను డిప్యూటీ కలెక్టర్ స్థాయికి పెంచాలని, రెవెన్యూ ఉద్యోగులపై దాడులను తీవ్రంగా పరిగణించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సీపీ రవిశంకర్ అయ్యన్నార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో కలెక్టరేట్ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బెహరా రవిశంకర్, గ్రామ పాలనాధికారి సంఘం అధ్యక్షుడు వెంకట అప్పారావు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా రమణయ్య హత్యకు నిరసనగా రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించారు.

ఆరు గంటల్లో గుర్తిస్తే ఎందుకు పట్టుకోలేదు?

... 5వ పేజీ తరువాయి

నుంచి ఆరు గంటల సమయం అంటే ఉదయం ఆరు గంటలకు నిందితుడి వివరాలు సేకరించారు. విమానంలో పారిపోవడానికి టికెట్ కొన్నాడని గుర్తించారు. మరి నిందితుడి వివరాలు విమానాశ్రయానికి పంపించి, అక్కడ ఎందుకు పట్టుకోలేకపోయారు?...అనే ప్రశ్నకు సమాధానం లేదు. ప్రస్తుతం విమానాశ్రయంలో రన్‌వేకు మరమ్మతులు జరుగుతున్నాయి. విమానాలు 8 గంటలకు బయలుదేరుతున్నాయి. శనివారం హైదరాబాద్ తొలి విమానం ఉదయం 8.30 గంటలకు బయలుదేరింది. పోలీసులకు ఆ సమాచారం ముందుగానే తెలిసి ఉంటే విమానం ఎక్కక ముందే నిందితుడిని పట్టుకునే అవకాశం ఉంది.

కుటుంబ సభ్యుల చెంతకు నిరాశ్రయుడు



సోదరితో అస్సాంకు చెందిన నానాబస

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 3 : టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్న అస్సాంకుచెందిన నానాబస(19)ని కుటుంబ సభ్యులకు శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధులు అప్పగించినట్టు గృహం మేనేజర్ కె.జ్యోతిర్మయి తెలిపారు అస్సాంలోని కొర్బి అంగ్లాంగ్ జిల్లా నైలలాంగ్ డిలాంగి గ్రామానికి చెందిన నానాబస మతిస్థితిమితంలేక గతేడాది డిసెంబరు 20న విశాఖ రైల్వేస్టేషన్‌కు చేరాడు. ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి ఏయూటీడీ షెల్టర్‌కు ఫోన్ చేసి అప్పగించారన్నారు.షెల్టర్‌లో వైద్యమందించిన తర్వాత తన పేరు, వివరాలు చెప్పాడన్నారు. ఆయన మానసిక పరిస్థితి సరిగ్గా లేకనాలుగు నెలల క్రితం ఇంటినుంచి పారిపోయి వైజాగ్ వచ్చేసినట్టు జ్యోతిర్మయి తెలిపారు. ఈ స్థితిలో డిఫూ జిల్లా మంజా గ్రామంలో ఉన్న అక్క,బావలకు నానాబసను అప్పగించారు.

గీతం సముద్ర తీర ఉత్సవం ప్రారంభం



బెలూన్లు వదిలి ఉత్సవాన్ని ప్రారంభిస్తున్న గీతం వర్సిటీ రిజిస్ట్రార్ గుణశేఖరన్

సాగర్‌నగర్, ఫిబ్రవరి 3 : గీతం వర్సిటీ యువతలో విజ్ఞాన నైపుణ్యాలతో పాటు సాంస్కృతిక, క్రీడలను ప్రోత్సహించడానికి ఏటా 'షోర్ ఫెస్ట్' పేరిట నిర్వహించే సముద్ర తీర ఉత్సవం శనివారం రుషికొండ తీరంలో ఘనంగా ప్రారంభమైంది. వందలాది మంది విద్యార్థులు ఉత్సవానికి హాజరయ్యారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ వివక్ష లేని సమాజం, ఆరోగ్యకరమైన జీవనం నుంచి నడవడిక అంశాలను ఉత్సవానికి నినాదంగా ఎంపిక చేయడం అభినందనీయమన్నారు. కాగా ఉత్సవంలో భాగంగా భారత నౌకాదళం ఆధ్వర్యంలో వీనుల విందైన సంగీతాన్ని నేవీ బ్యాండ్ బృందం ఆలపించింది. సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.శ్రీభరత్, లైఫ్ డైరెక్టర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన బుమ్రా

... 5వ పేజీ తరువాయి

ఓవర్‌లో పోప్‌ను పెవెలియన్‌కు పంపాడు. తొలి టెస్టులో 196 పరుగులు చేసిన పోప్ (23)...ఈ మ్యాచ్‌లో వికెట్ల ముందు పాతుకుపోతున్న సమయంలో బుమ్రా అవుట్ చేయడంతో స్టేడియం హర్షధ్వానాలతో మారుమోగింది. కొద్దిసేపటికే జానీ బెయిర్‌స్టో (25)ను కూడా బుమ్రా పెవిలియన్‌కు పంపడంతో ఇంగ్లండ్ 159 పరుగులకు ఐదు వికెట్లు పడిపోయి కష్టాల్లో పడింది. రెండో స్పెల్‌లో తిరిగి బౌలింగ్‌కు వచ్చిన బుమ్రా అదే ఊపును కొనసాగించాడు. వ్యక్తిగత 47 పరుగులతో ఉన్న కెప్టెన్ బెన్ స్టోక్స్‌ను అద్భుతమైన బంతితో క్లీన్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్ శిబిరం డీలాపడిపోయింది. బెన్ ఫోక్స్ (6), రెహన్ అహ్మద్ (6)లను కులదీప్ యాదవ్ పెవెలియన్‌కు పంపగా...చివరి బ్యాట్స్‌మెన్లు టామ్ హార్ట్‌లీ (21), అండర్సన్ (6)లను బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లంగ్ ఇన్నింగ్స్ 253 పరుగుల వద్ద ముగిసింది. బుమ్రా 6 వికెట్లు తీయగా, కుల్దీప్ 3, అక్షరపటేల్ ఒక వికెట్ తీసుకున్నారు. 143 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన భారత్ కెప్టెన్ రోహిత్ శర్మ, జైస్వాల్‌కు ప్రేక్షకులు చప్పట్లతో స్వాగతం పలికారు. రెండో రోజు ఆట ముగిసే సరికి భారత్ ఐదు ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 28 పరుగులు చేసింది. జైస్వాల్ 15, రోహిత్‌శర్మ 13 పరుగులతో క్రీజులో ఉన్నారు.

జగదల్‌పూర్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 3: భద్రతా ఆడిట్‌లో భాగంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ శనివారం జగదల్‌పూర్‌లో పర్యటించారు. ఓవర్ హెడ్ ఎక్యూప్‌మెంట్ (ఓహెచ్ఈ), పాయిం ట్లు, లెవెల్ క్రాసింగ్‌లు, ట్రాక్ సర్క్యూట్, యార్డు లేఅవుట్, ట్రాక్ లు, రిలే గది, ఇతర భద్రతా అంశాలను తనిఖీ చేశారు. స్టేషన్ మా స్టర్, ఇతర సిబ్బందితో పలు అంశా లపై సమీక్షించారు. రైల్వే కాలనీలో పర్యటించి సదుపాయాల కల్పన, నిర్వహణపై నివాసితుల నుంచి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నక్కి సెమారా స్టేషన్‌లో పర్యటించి ప్రయాణికుల మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అధికారులు పాల్గొన్నారు.

సమన్వయకర్తే అభ్యర్థి అవుతారన్న గ్యారంటీ లేదు

... 5వ పేజీ తరువాయి

నాగిరెడ్డి వర్గీయులకు మింగుడుపడలేదు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి తన అనుయాయులతో ఆయన సమావేశమయ్యారు. టికెట్ విషయంలో ఎవరూ నిరుత్సాహ పడవద్దని, అంతా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశానికి టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తిరెడ్డితో పాటు మరికొంతమంది కార్పొరేటర్‌లు, ముఖ్యనాయకులు హాజరయ్యారు. సమావేశంలో గాజువాక అభివృద్ధిపై కూడా మాట్లాడినప్పటికీ టికెట్ గురించే ప్రధానంగా చర్చ జరిగింది.

6న సర్పంచుల చలో అసెంబ్లీ

పద్మనాభం (రూరల్), ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న వైసీపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈనెల 6న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ. 8660 కోట్లు దారి మళ్లించారని, వాటిని తిరిగి ఇవ్వడంతో పాటు సర్పంచుల 16 సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు.

మానసిక దృఢత్వం అవసరం

తగరపువలస, ఫిబ్రవరి 3 : వైద్య వృత్తిలో ప్రవేశించే వారికి మానసిక దృఢత్వం అవసరమని పారా సైకాలజీలో డాక్టరేట్ చేసిన మోటివేషనల్ స్పీకర్ డా.పి. జగన్నాథరావు అన్నారు. సంగివలస డెంటల్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు రెండు రోజులుగా నిర్వహిస్తున్న మోటివేషన్ తరగతులు శనివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు వృత్తిపరమైన సామర్థ్యాలను పెంచుకోవడానికి మానసిక దృఢత్వం ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించే ఇటువంటి శిక్షణల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని చెప్పారు.

అయోధ్య రామాలయం పేరుతో చందాలు వసూలు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 3 : అయోధ్యలో రామాలయం నిర్మాణం పేరుతో కొంతమంది అక్రమంగా చందాలు వసూలు చేస్తున్నారని సింగనబంద సర్పంచ్ జీవీ నారాయణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది రశీదులు పట్టుకుని గ్రామాల్లో తిరుగుతూ పుస్తకాలు అయోధ్య రామాలయ ట్రస్టు నుంచి వచ్చాయని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈవిషయమై తాను రామాలయం ట్రస్టు ప్రతినిధులను ఫోన్‌లో సంప్రతించగా తాము ఎటువంటి రశీదులు పంపించలేదని చెప్పినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శన

మధురవాడ, ఫిబ్రవరి 3 : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం సాయంత్రం శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు ఏఓ విశ్వనాథరెడ్డి తెలిపారు. నగరానికి చెందిన సిద్ధేంద్రయోగి నాట్యాలయం కళాకారులు నృత్యాలు ప్రదర్శించనున్నట్టు చెప్పారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

దుకాణాలపై దాడులు

ఆరిలోవ, ఫిబ్రవరి 3 : ఆరిలోవలోని పలు హోటళ్లు, కిరణా దుకాణాలపై జీవీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాలిథిన్ కవర్లు విక్రయిస్తున్న వారికి జరిమానా విధించారు. అనంతరం టీమ్ సభ్యుడు డి. మురళీకృష్ణ మాట్లాడుతూ పాలిథిన్ కవర్లు వాడడం వల్ల అనేక రోగాలు వస్తాయని, ప్రజలంతా పాలిథిన్ కవర్లను నిషేధించాలని కోరారు.

శ్రీకృష్ణాపురం గురుకులంలో 'పొలంబడి'

ఆరిలోవ, ఫిబ్రవరి 3 : శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో శనివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులతో పలు రకాల మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నవల్లి, బోటనీ జేఎల్ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

కంటి కేన్సర్ పట్ల అప్రమత్తం

ఆరిలోవ, ఫిబ్రవరి 3 : చిన్న పిల్లల కంట్లో వచ్చిన తెల్లని ప్రతి బింబం కంటి కేన్సర్‌కు సంకేతమని డాక్టర్ వీరేంద్ర సచిదేవ్ తెలిపారు. శనివారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య శాలలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా చిన్నారులకు కంటి కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కంటి కేన్సర్ అత్యంత ప్రాణాంతకమైనదని, వెంటనే వైద్యులను సంప్రతించడం ద్వారా వ్యాధిని నయం చేసుకోవచ్చునని చెప్పారు.

భీమిలి తహసీల్దార్‌గా గోవింద్

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 : మండల తహసీల్దార్‌గా టి. గోవింద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా గరివిడి నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన సీహెచ్‌వీ రమేష్‌ను విజయనగరం జిల్లా గజపతినగరం మండలానికి బదిలీ చేశారు.

సినిమా గైడ్

- **అంబాజీపేట మ్యారేజి బ్యాండు :** మెలోడి, రమాదేవి, శరత్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), సప్తగిరి (తగరపువలస)
- **బూట్‌కట్ బాలరాజు :** మోహిని (గాజువాక),
- **ధీర :** కిన్నెర, మౌర్య (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **కిస్మత్ :** కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), విశేష్ (గాజువాక),
- **కెప్టెన్ మిల్లర్ :** వెంకటేశ్వర
- **నా సామిరంగ :** శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), మోహిని కాంప్లెక్స్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **గుంటూరు కారం :** జగదాంబ, సంగం, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 20,టమాటా 30, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 54, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 16, క్యారేట్ 24, దొండకాయలు 32, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)4, మునక్కాడలు (కిలో) 95, అల్లం (పాతది) 115, బరబటి 26, ముల్లంగి 18,నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 32,వెల్లుల్లి (పెద్దవి) 360, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 52 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 56, చిలగడదుంపలు 28 , కంద 54, దేముడు చిక్కుడు 32, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, క్యాప్సికమ్ లం 20, మామిడి అల్లం 60, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	97
ఫారం ధర	117
విత్ స్కిన్	204
స్కిన్‌లెస్	214

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

ఇండోర్ స్టేడియం ఆధునికీకరణకు చర్యలు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ


పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 3 : జీవీఎంసీ జోన్ 3లో ఉన్న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికీకరించాలని కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో చేపడుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెన్నిస్ కోర్టును పూర్తిగా ఆధునికీకరించి వెంటనే వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అనుగుణంగా ఉన్నత ప్రమాణాలతో స్టేడియం అభివృద్ధి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ వినయ్‌కుమార్‌ను ఆదేశించారు. అలాగే స్టేడియంలో పచ్చదనం, వీక్షకుల గ్యాలరీ, లైటింగ్, ఫ్లోరింగ్,ఏసీ, టాయిలెట్స్ తదితర సదుపాయాలతో అందంగా తీర్చిదిద్ది త్వరితగతిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రఘునాథ్, స్పోర్ట్స్ డైరెక్టర్ హనుమంతరావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు ప్రసాద్, అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జట్లమ్మ కొండ వివాదంపై ఆర్‌డీఓకు ఫిర్యాదు

భీమునిపట్నం (రూరల్), ఫిబ్రవరి 3 : మండలంలోని లొడగలవానిపాలెం, ఆనందపురం పంచాయతీల సరిహద్దులో ఉన్న జట్లమ్మ కొండ వివాదాస్పదంగా మారింది. కొండ ప్రాంతం జాతీయ రహదారికి దగ్గరగా ఉండడంతో ఇళ్ల స్థలాలు కోసం రెండు పంచాయతీలు ప్రయత్నిస్తున్నాయి. ఈవిషయమై శనివారం ఇరు పంచాయతీల పెద్దలు భీమిలి ఆర్‌డీఓకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కొండ ప్రాంతంలో ఇప్పటికే కొంతమందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఖాళీగా ఉన్న స్థలంలో ఆనందపురం పంచాయతీకి చెందిన వారికి పట్టాలు ఇవ్వడానికి పంచాయతీ తీర్మానం కూడా చేసింది. అయితే కొండ స్థలం తమ పంచాయతీకి చెందినదని, ఇందులో ఇతర పంచాయతీలకు చెందిన వారికి పట్టాలు ఎలా ఇస్తారని లొడగలవానిపాలెం ప్రజలు జిల్లా కలెక్టరుకి, ఆర్‌డీఓకు గతంలో ఫిర్యాదు చేశారు. ఆనందపురం పంచాయతీ నుంచి తమ పంచాయతీని విడగొట్టారని సర్వే నంబరు తమ పంచాయతీలోనే ఉందని, అందువల్ల తమకు చెందుతుందని వాదిస్తున్నారు. ఈమేరకు వారు గ్రామస్తులకు పట్టాలిచ్చేందుకు స్థలాన్ని చదును చేస్తున్నారు. దీనిపై స్పందించిన ఆర్‌డీఓ దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశారు. కాగా గొడవ పడుతున్న ఇరు పంచాయతీల ప్రజాప్రతినిధులు అధికార పార్టీకి చెందినవారు కావడం గమనార్హం. కొండ పరిధి వివాదం తేలేవరకు భారీ యంత్రాలతో కొండను చదును చేసే కార్యక్రమాన్ని నిలుపుదల చేయాలని వారు కోరుతున్నారు. ఈ వివాదాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాసరావు దృష్టికి కూడా తీసుకువెళ్లారు.

భారత నౌకాదళం సేవలు నిరుపమానం

- గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం.శ్రీభరత్


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

సాగర్‌నగర్, ఫిబ్రవరి 3 : దేశ రక్షణకు భారత నౌకాదళం చేస్తున్న సేవలు నిరుపమానం అని గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీభరత్ అన్నారు. భారత నౌకాదళంకు చెందిన నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ గీతం వర్సిటీతో శనివారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడే నౌకాదళం కుటుంబాలకు అండగా నిలవడం తమవంతు బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. అనంతరం గీతం వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, నేవీ వెల్ఫేర్ అండ్ వెల్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు కళాహరికుమార్,తూర్పు విభాగం అధ్యక్షురాలు సంధ్యా పెండార్కర్, నౌకాదళం విద్యా విభాగం కమాండోర్ జి. రాంబాబు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

వీఎంఆర్‌డీఏ ప్రధాన ఇంజనీర్‌కు సన్మానం



సిరిపురం, ఫిబ్రవరి 3 : వీఎంఆర్డీఏలో ప్రధాన ఇంజనీర్‌గా 13 నెలలుగా సేవలందించి బదిలీపై సీఆర్‌డీఏకు వెళ్తున్న పి. శివప్రసాదరాజును వీఎంఆర్డీఏ భవన్‌లో సాంకేతిక విభాగం అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రవీంద్ర, ఓఎస్‌డీ నందిని, సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

యువత అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 3 : రాష్ట్రంలోని యువత సామర్థ్యాలపై తమకు అపారమైన నమ్మకం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ డెవలప్‌మెంట్ డైలాగ్ కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. యువతకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ పని చేస్తున్నారన్నారు. నాలుగున్నరేళ్లుగా ఉన్నత విద్యా రంగాన్ని నిర్దిష్ట లక్ష్యాలతో నడిపిస్తున్న విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఆర్ట్స్ కామర్స్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీరామ్మూర్తి, రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్, డీన్‌లు కిషోర్‌బాబు, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అభివృద్ధి అభినందనీయం

ఏయూను నాలుగున్నరేళ్లుగా వీసీ ప్రసాదరెడ్డి అభివృద్ధి చేసిన విధానం అభినందనీయమని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె. హేమచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన ఏయూను సందర్శించి అధికారులతో పాలక మండలి సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏయూ సాధించిన ప్రగతి స్పష్టంగా కనిపిస్తోందని, ఇది ఇతర విశ్వవిద్యాలయాలకు మార్గదర్శకంగా నిలుస్తోందన్నారు. నాక్ పర్యటన సందర్భంగా 3.74 స్కోర్ సాధించడం అత్యంత ఆనందాన్ని కలిగించిందన్నారు.

ప్రసాద్ పథకం పనులు ప్రారంభించాలని వినతి

సింహాచలం, ఫిబ్రవరి 3 : సింహగిరిపై కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకం కింద చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఈనెల మూడో వారంలో శంకుస్థాపన చేయాలని ట్రస్టీలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును కోరారు. శనివారం అప్పన్న దర్శనానికి వచ్చిన ఎమ్మెల్యేను వారు కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో త్వరలోనే పనులకు శంకుస్థాపన చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మరమ్మతుకు అనుమతులు జారీ

సింహాచలం, ఫిబ్రవరి 3 : పంచ గ్రామాల్లో ఇళ్ల మరమ్మతుకు దరఖాస్తు చేసుకున్న వారికి దేవదాయ శాఖ అనుమతి పత్రాలు జారీ చేసింది. శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి బాధితులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ తొలివిడతగా పెందుర్తి, భీమిలి, పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల పరిధిలో 530 మంది ఇళ్ల మరమ్మతుకు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. భవిష్యత్‌లో కూడా బాధితులు దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు అనుమతులు జారీ చేస్తామని చెప్పారు.

జల సంరక్షణలో జేఆర్ నగర్‌కు మరో అవార్డు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 3 : పాత వెంకోజీపాలెంలోని జేఆర్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘానికి జల సంరక్షణలో మరో అవార్డు లభించింది. ఈమేరకు ఈనెల 5న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షేకావత్ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్టు జేఆర్‌నగర్ కాలనీ అధ్యక్షుడు డాక్టర్ మూర్తి తెలిపారు. గత ఆరేళ్లలో జేఆర్‌నగర్‌కి ఇది మూడవ అవార్డు అని చెప్పారు. న్యూఢిల్లీకి చెందిన వాటర్ డైజెస్ట్ పత్రికా సంస్థ ఏటా ఈ అవార్డులు ఇస్తుందన్నారు.

పేదలకు సొంతింటి కల సాకారమే లక్ష్యం

ఆనందపురం, ఫిబ్రవరి 3 : పేదలకు సొంతింటి కల సాకారమే వైసీపీ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామంలో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దబ్బంద గ్రామంలో 1902 టిడ్కో ఇళ్లు నిర్మించి రాష్ట్రంలోనే అతి పెద్ద లేఅవుట్ ఏర్పాటు చేశామన్నారు. లబ్ధిదారునికి సుమారు రూ. 8 లక్షలు విలువైన ప్లాట్‌ను కేవలం రూ. 60 వేల రిజిస్ట్రేషన్ చార్జీలతో అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సత్యన్నారాయణ, రాష్ట్ర టిడ్కో గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ ప్రసన్నకుమార్, నాయకులు కోరాడ వెంకటరావు, బంక సత్యన్నారాయణ, మజ్జి వెంకటరావు, పొంద్రంకి శ్రీను, బలిరెడ్డి మహేష్, జీల గౌతమి పాల్గొన్నారు.

గంజాయికి కేరాఫ్‌గా ఏపీ : కోరాడ

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 :రాష్ట్రం గంజాయికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు విమర్శించారు. శనివారం రాత్రి ఆయన చిన్నబజారులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ వనరులు, ప్రజా సంపద దోపిడీకి గురవుతున్నాయన్నారు. అరాచకం రాజ్యమేలుతుందన్నారు. పాలకుడి మాదిరిగానే పోలీసులు కూడా తదనుగుణంగా తయారయ్యారని విమర్శించారు. దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా దాని మూలాలు రాష్ట్రంలో వుండడం బాధాకరమన్నారు. కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ 22 కిలోల గంజాయితో పట్టుబడడం, హైదరాబాద్‌లో మరో పోలీసు కానిస్టేబుల్ గంజాయితో పట్టుబడడంతో ఏపీలో గంజాయి స్మగ్లింగ్ ఏ స్థాయిలో జరుగుతుందో అర్థమవుతుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెబు తారని హెచ్చరించారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



సింహాచలం, ఫిబ్రవరి 3 : వరాహలక్ష్మీనృసింహస్వామికి పలు ఆర్జిత సేవలను శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో కల్యాణ మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్రనామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. ఉదయం 9.30 గంటలకు అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించారు.

'వైసీపీ పాలనలో హత్యలకు నిలయంగా రాష్ట్రం'



భీమునిపట్నం, ఫిబ్రవరి 3 : వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల ప్రాణాలకు రక్షణ లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విమర్శించారు. శనివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. తహసీల్దార్ రమణయ్యకు ప్రజల్లో మంచి అధికారిగా పేరుందన్నారు. ప్రజలకు మంచి చేసి, వారి ఆస్తులను కాపాడుతూ వుండడమే ఆయన చేసిన నేరమా అని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో నేరాలు బాగా పెరిగిపోయాయని, ఫ్యాక్షనిస్టు చేతిలో పాలన ఉంటే రాష్ట్రంలో పరిస్థితులు ఎలా వుంటాయనడానికి రమణయ్య హత్య నిదర్శనమని తెలిపారు. మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ప్రాణాలకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కరవు : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో అధికారుల ప్రాణాలకు రక్షణ కరవైందని టీఎస్ఎన్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్‌గోపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తహసీల్దార్ హత్యకు గురవడం వైసీపీ నాయకుల భూదాహానికి నిదర్శనమని చెప్పారు. విశాఖను రాజధానిగా చేయకముందే ఇలాంటి దారుణాలు జరుగుతుంటే, మారిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా రగ్బీ పోటీలు


పోటీలో తలపడుతున్న బాలికల జట్లు

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 : పట్టణంలోని ఫుట్‌బాల్ మైదానంలో రాష్ట్రస్థాయి రగ్బీ ఛాంపియన్ షిప్ (అండర్-14) పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. విశాఖపట్నం రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగు తున్న ఈ పోటీలను ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు లలిత్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. శనివారం బాలుర క్వార్టర్ ఫైనల్స్‌లో కర్నూలు జట్టు 20-0 పాయింట్లతో గుంటూరుపై విజయం సాధించింది. ప్రకాశం జట్టు 15-0 స్కోరుతో చిత్తూరుపై గెలుపొందింది. బాలికల విభాగంలో క్వార్టర్ ఫైనల్స్‌లో అనంతపురం 10-0 పాయింట్లతో అనకాపల్లిపై విజయం సాధించింది. ఆదివారం బాలురు, బాలికల విభాగంలో ఫైనల్ పోటీలు జరగనున్నాయి. కార్యక్రమంలో ది సన్ స్కూల్ డైరెక్టర్ లక్ష్మీలావణ్య, కరస్పాండెంట్ కైతపల్లి శ్రీనివాసరావు, విశాఖ రగ్బీ అసోసియేషన్ కార్యదర్శి కిషోర్ కుమార్, కోశాధికారి పి. అరుణ్‌కుమార్, పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి అభినందనలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 3 : నగరాన్ని సుందరంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది పాత్ర కీలకమైనదని 18 వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలరావు అన్నారు. శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో స్వచ్ఛతా సర్వేక్షణ్‌లో విశాఖకు 4వ స్థానం రావడమే కాకుండా అందులో 18 వార్డుకు మూడవ స్థానం దక్కడానికి కారణమైన పారిశుధ్య సిబ్బంది కృషి అభినందనీయమని చెప్పారు. పారిశుధ్య సిబ్బంది నిరంతర కృషి వల్లే తమ వార్డుకు రూ. 5 లక్షల నగదు రివార్డు వచ్చిందన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 3 : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో శారదాంబా విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం వెంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుదర్శన హవనం, హయగ్రీవ మూలామంత్ర హవనం, లక్ష్మీ గణపతి హవనం పూజలు చేశారు. మధ్యాహ్నం కల్యాణం అనంతరం ఊంజల సేవ నిర్వహించారు. సాయంత్రం వీణానాదం, సంకీర్తనార్చన, భగవన్నామ సంకీర్తన ఏర్పాటు చేశారు.

98వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింహాచలం, ఫిబ్రవరి 3 : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో జీవీఎంసీ సాధారణ నిధులు రూ.77.36 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ పివి నరసింహం శనివారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రం వెనుక వీధిలో, ఆకుల వీధిలో, గాంధీనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, వార్డులోని హరిహరానంద నగర్‌లో బీటీసీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయన్నారు.

జోన్ వన్ కమిషనర్‌గా శైలజా వల్లి

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 : జీవీఎంసీ జోన్ వన్ కమిషనరుగా జి. శైలజా వల్లి శనివారం బాధ్యతలు చేపట్టారు. రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బొడ్డేపల్లి రామును తూర్పుగోదావరి జిల్లా మండపేట కమిషనరుగా బదిలీ చేశారు. నూతన జడ్సీ సాయంత్రం కార్యాలయానికి రాగా సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

'ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలు సరికాదు'

సిరిపురం, ఫిబ్రవరి 3 : విశాఖ డీపీటీఓ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఆర్ రావు ఆరోపించారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా, రీజనల్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక దీక్ష శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిలపాలెం డిపో సెక్రటరీ పి. చిన్నా, గాజువాక డిపో కార్యదర్శి పి. శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


ట్రై సైకిళ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

విభిన్న ప్రతిభావంతులకు చేయూతనిద్దాం

- కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున

కొమ్మాది, ఫిబ్రవరి 3 : విభిన్న ప్రతిభావంతులు స్వతహాగా ఎదగడానికి ప్రతిఒక్కరూ చేయూతనివ్వాలని జిల్లా కలెక్టర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. శనివారం చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన ట్రై సైకిళ్లు, ల్యాప్‌ట్యాప్‌లు, చెవిటి మెషన్లు పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గంలో 280 మంది విభిన్న ప్రతిభావంతులను గుర్తించి పలు ఉపకరణాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధికారులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ డైరెక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది నిరసన


ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 : చినగదిలి తహసీల్దార్ రమణయ్య హత్యను నిరసిస్తూ స్థానిక తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల ఉద్యోగులు, సిబ్బంది శనివారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అంతకుముందు వారు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ విశాఖ రూరల్ మండల తహసీల్దార్‌గా పనిచేసిన రమణయ్య ఇటీవలే విజయనగరం జిల్లా బొండపల్లికి బదిలీపై వెళ్లారన్నారు. దుండగులు ఆయన్ను హత్య చేయడం విచారకరమన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలలో డెప్యూటీ తహసీల్దార్ (ఎలక్షన్స్) జె. భాస్కరరావు, ఆర్డీవో కార్యాలయం డెప్యూటీ తహసీల్దార్ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు.

4వ వార్డులో జనసేన నేతల పాదయాత్ర


పాదయాత్రలో భాగంగా కాపులుప్పాడ గ్రామస్తులతో సందీప్

భీమునిపట్నం, ఫిబ్రవరి 3 : జనసేన భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ శనివారం 4వ వార్డులో పాదయాత్ర చేశారు. వార్డులోని కాపులుప్పాడ, పరదేశిపాలెం, సోమన్నపాలెం, కల్లివానిపాలెం గ్రామాల్లో పర్యటించి, ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలన నుంచి విముక్తి కలగాలంటే వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు గరికిన అప్పారావు, బాలు, ఎల్లయ్యరెడ్డి, అనిల్, టీడీపీ నాయకులు దేవాడ అప్పలకొండ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యనారాయణ

మద్దిలపాలెం, ఫిబ్రవరి 3 : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం, చైతన్యనగర్‌లో పలు అభివృద్ధి పనులకు వైసీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 48.50 లక్షల జీవీఎంసీ నిధులతో మద్దిలపాలెం, చైతన్యనగర్‌లో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం స్వచ్ఛతా ఎకో వైజాగ్ అవార్డులో 8వ ర్యాంక్ సాధించినందుకు వార్డు కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, పారిశుధ్య సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన ర్యాలీ

ఆనందపురం, ఫిబ్రవరి 3:మండలంలోని ఎల్‌వీపాలెంలో కుష్ఠు వ్యాధిపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యుడు గంగునాయుడు మాట్లాడుతూ స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు గల చర్మం, చెవులు, వీపు, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కను రెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం వంటివి సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రతించాలన్నారు. అలాగే కనురెప్పలు మూతపడకపోవడం, ముకు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు, చేతులు తిమ్మిరి కలిగి ఉండడం వంటి లక్షణాలు ఉన్నా.. వైద్యులను సంప్రతించాలన్నారు.

పద్మనాభంలో...

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. బ్రైట్ ఫ్యూచర్ డవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో కోరాడ, గెద్దపేట గ్రామాల్లో ర్యాలీలు చేసి, వ్యాధి లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

అద్వానీకి భారతరత్న ప్రకటన పట్ల హర్షం

ఆనందపురం, ఫిబ్రవరి 3 : కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ కురువృద్ధుడు ఎల్‌కే అద్వానీకి భారతరత్న అవార్డు ప్రకటించడం పట్ల మండల బీజేపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. దేశాభివృద్ధిలో తనదైన పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి అద్వానీ అని కొనియాడారు. 15 ఏళ్ల వయస్సులోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి సుదీర్ఘ సేవలు అందించారన్నారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షనీయమన్నారు.

వీధుల్లోకి అడవి దుప్పి



ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 3 : సీతకొండలో ఉంటున్న అడవి దుప్పిలు,జింకలు ఆహారం కోసం కొండ దిగువన ఉన్న కాలనీల్లోకి వస్తున్నాయి. శనివారం రాత్రి విశాలాక్షినగర్ వీధుల్లోకి పెద్ద కొండ దుప్పి వచ్చేసింది. పిల్లలు దానికి ఆహారం అందిస్తూ.. ఫొటోలు దిగుతూ సందడి చేశారు.